# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

సెప్టెంబరు - September - 2022



ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక

స్థాపకులు : **పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

సంపాదకులు : స్వామిని వినమ్రానంద

సంపుటి / **Vol. 98** సెప్టెంబరు/**SEPTEMBER - 2022** సంచిక/**No.9**

| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన - అదితికృత శ్రీహరి స్తుతి | 2 |
| 2. | ధ్యానము - శ్రీ చైతన్య మహాప్రభు | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ- అనువాదం బొప్పన అరుణాదేవి. | 3 |
| 4. | అబ్‌తో జీవన్ హోరే - స్వామి తేజోమయానంద | 9 |
| 5. | గురువాచక కోవై - మురుగనార్ | 13 |
| 6. | శ్రీ తులసీ సర్వస్వము - జి.వి.యస్. సుబ్రహ్మణ్య శాస్త్రి | 16 |
| 7. | భానుదాస చరిత్రము - మహాభక్త విజయము | 18 |
| 8. | గుణపాఠం - చిన్మయామిషన్ | 22 |
| 9. | శ్రీ రాముడు తెల్పిన నవవిధ భక్తులు - స్వామి పద్మనాభానంద సరస్వతి | 24 |
| 10. | కార్యక్రమములు | 26 |

* ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.

**జీవిత సభ్యత్వం రూ. 1000/-లు సాలుసరి రూ.100/-**

# ప్రార్థన

**అదితికృత శ్రీహరి స్తుతి**

**ప్రార్థన ద్వారా మనస్సు పరిశుద్ధమవుతుంది**

అదితిరువాచ । యజ్ఞేశ యజ్ఞపురుషాచ్యుత తీర్థపాద తీర్థ శ్రవశ్శ్రవణమంగళనామధేయ।
ఆపన్నలోకవృజినోపశమోదయాద్య శం నః కృధీశ భగవన్నసి దీననాథః॥ 8

అదితి ఇట్లు పలికెను యజ్ఞము రూపములో ప్రకటమైన ఓ పురుషోత్తమా! యజ్ఞమునకు ఫలము నిచ్చువాడవు నీవే. నీకు స్వరూపమునుండి చ్యుతి లేదు. నీ పాదములు భక్తులను పావనము చేయును. పావనము చేసే గంగ నీ పాదములనుండి పుట్టినది. నీ కీర్తి గానము చేయువారిని పావనము చేయును. నీ నామమును వినుటచే మంగళము కలుగును. నీవు ఆపదలోనున్న భక్తుల దుఃఖమును చల్లార్చుటకై అవతరించెదవు. సర్వజగత్కారణుడవగు ఓ ఈశ్వరా! మాకు సుఖమును కలుగజేయుము. ఓ భగవానుడా! నీవు దీనులకు రక్షకుడవు. సాక్షాత్తు శ్రీహరియే యజ్ఞము రూపముగా ప్రకటమగుచున్నాడని యజ్ఞో వై విష్ణుః అనే శ్రుతి వక్కాణించుచున్నది.

**విశ్వాయ విశ్వభవనస్థితిసంయమాయ స్వైరం గృహీతపురుశక్తిగుణాయ భూమ్నే ।**
**స్వస్థాయ శశ్వదుపబృంహితపూర్ణబోధవ్యాపాదితాత్మ తమసే హరయే నమస్తే॥ 9**

ఓ శ్రీహరీ! నీవు నీ ఇచ్ఛచే గొప్ప మాయా శక్తియొక్క రజస్సత్త్వతమోగుణములను ఉపాధిగా స్వీకరించి క్రమముగా జగత్తుయొక్క సృష్టిస్థితిలయములకు కారణమై, నీవే జగ ద్రూపముగా వెలసినావు. దేశకాలములకు అతీతమైన నీవు శాశ్వతకాలము వర్ధిల్లే పూర్ణజ్ఞాన స్వరూపమునందు నిలిచి తమస్సునకు అతీతుడవై యున్నావు. నీకు నమస్కారము.

# ధ్యానము

**శ్రీ చైతన్య మహాప్రభువు**

**ధ్యానము ద్వారా శాంతి లభించును**

**శ్లో॥ భుజే సవ్యే వేణుం శిరసి శిఖిపింఛం కటితటే**
**దుకూలం నేత్రాంతే సహచరికటాక్షం విదధతే ।**
**సదా శ్రీమత్ బృందావనవసతి లీలాపరిచయః**
**జగన్నాథస్వామీ నయనపథగామీ భవతు మే ॥**

తా॥ ఈ శ్లోకమునందు కూడా శ్రీ జగన్నాథుని శ్రీకృష్ణుని రూపములో శ్రీచైతన్యుడు స్తుతించుచున్నాడు. శ్రీ జగన్నాథుడు శ్రీకృష్ణ రూపములో ఉన్నప్పుడు కుడిచేతితో వేణువును పట్టుకొని ఉండును. తలపై నెమలి పింఛముండును. నడుముపై మెరిసే పీతాంబర ముండును. కళ్ళకొసలలో (క్రీగన్నులో) తోటి మిత్రులపై ఆతని దయావీక్షణము ప్రసరించుచుండును. ఎల్లప్పుడు బృందావన ప్రాంతములోనే నివసించుటకు కృష్ణుడు ఉత్సాహపడుచుండును. ఆ కృష్ణరూపియైన శ్రీ జగన్నాథస్వామి నా కెప్పుడును ప్రత్యక్షము అగునుగాక!

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

**అధ్యాయం - 41**

**మూలం : స్వామి ఓంకార్** **అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి**

## సంపూర్ణంగా భగవంతునికి శరణాగతి చెందుము

**సూర్యకిరణాల సందేశము**

ఈ రోజు మరొక అద్భుతమయిన అనుభవము, ఆనందంగా జీవించడానికి, శ్వాసించడానికి, అలాగే భగవంతుని ఉనికిని అర్థం చేసుకోవడానికి లభించింది. ఆ రాత్రి నేను ప్రశాంతంగా, సంతృప్తిగా నిదురించాను. కాని ఆశ్రమంలో నివసించే చిన్ని పిల్లిపిల్ల ఒకటి నెమ్మదిగా నా పక్కన చేరి నాకు నిద్రాభంగం కలిగించసాగింది. అది పదే పదే నా దుప్పటి క్రిందికి దూరటానికి ప్రయత్నించసాగింది. నేను దీర్ఘకాలంలో ఆశ్రమంలో ప్రతిది సక్రమంగా, సవ్యంగా జరిగే విధంగా చేయగలిగాను కాని ఈ చిన్ని పిల్లిపిల్లను నియంత్రించలేకపోయాను. ఆశ్రమంలోని పిల్లలు దానిని ఎంతో జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండేవారు, అయినా ఆ పిల్లి పిల్లలు వాళ్ళ కళ్ళు కప్పి ఏదో విధంగా కిటికీలోంచి దూరి నా గదిలో ప్రవేశించేవి. నేను దీక్షలో ఉన్నాను కనుక ఆధ్యాత్మికశక్తి అవి అర్థం చేసుకున్నాయా! అనిపించే విధంగా నెమ్మదిగా, శబ్దం చేయకుండా వచ్చినా కాళ్ళ వద్ద గాని, లేదా నా పక్కన గాని పడుకొనేవి. కాని ఒక పిల్లి మాత్రం పగలు ఆశ్రమంలో తిరుగుతుండేది. రాత్రి నిద్రపోయే సమయం కాగానే నెమ్మదిగా పాకుతూ నా గదిలో చేరి నా తొడ మీద తలపెట్టుకొని పడుకునేది. లేదా నా హృదయానికి బాగా దగ్గరగా చేరి నిద్రపోయేది. అది నాకు ఒక విషయాన్ని గుర్తుచేసింది. తొందరగానో లేదా నెమ్మదిగానో జీవితంలో మనకు సహాయం వస్తుంది. ప్రపంచపు ఆశాపాశాల్లో చిక్కుకొని అల్లాడుతూ తిరిగి తిరిగి అలసిపోయి విశ్రాంతి కోరుకుంటాము. ప్రశాంతత కోసం అలమటిస్తాము. అప్పుడు మనము కూడా నెమ్మదిగా విశ్వశక్తి స్వరూపమయిన ఈశ్వరుని సన్నిధానానికి చేరుకుంటాము.

నిన్న, ఈ రోజు కూడా నేను సూర్యరశ్మిలో చాలా ఎక్కువ సమయం గడిపాను. సూర్యకిరణాలతో స్నానం, ధ్యానం జీవితంలో ఎంతో ఆనందానుభవాన్ని కలిగిస్తుంది. మనకు ఆరోగ్యాన్ని, జీవితాన్ని సూర్యకిరణాలు ప్రసాదిస్తాయి. అసలు జీవితం అంటే ఏమిటి? సూర్యకిరణాలు లేకుండా మన జీవితాలకు ఉనికి ఉంటుందా? అసలు మనము ఎప్పుడయినా ఆలోచించామా? సూర్యకిరణాలు మనపై వెలుగు ప్రసరింప చేస్తూ నిరంతరము మనలను ఆశీర్వాదిస్తూ ఆత్మ సాక్షాత్కరము వైపుగా మనలను నడిపిస్తుంటాయి. ఏ విధంగా సూర్యుని కిరణాలు గడ్డకట్టిపోయిన మన హృదయాన్ని చీల్చుకొని పోయి మానవత్వాన్ని మేలుకొల్పుతున్నాయో ఆ విధంగా మనము ఎప్పుడయినా ప్రయత్నం చేశామా? సూర్యుని కిరణాలు మన ప్రేమమయ హృదయాన్ని

బాగా శుభ్రం చేసి పరిశుద్ధం గావించినప్పుడు, అవి హృదయాన్ని పూర్తిగా ప్రపంచము యావత్తును ప్రేమించే విధంగా తయారుచేసినప్పుడు, సూర్యునికే సూర్యుని వెలుగును ఇచ్చే పరమాత్మను తెలుసుకోగల్గుతాము, దర్శించుకోగలుగుతాము.

అది శీతాకాలము కావటం వలన, సూర్యుని కిరణాలు వెచ్చగా లేవు. అందువలన నేను ఆ లేలేత సూర్యకిరణాలలో స్నానమాడుతూ సమయం తెలియకుండా చాలా సేపు ఉండిపోయేవాడిని. ప్రశాంతంగా ఆత్మానందాన్ని పొందేవాడిని. అది పూర్తి అయిన తర్వాత సాధారణంగా నేను ఎప్పుడూ చేసేవిధంగా గోరువెచ్చని నీటితో ముందుగా తర్వాత చల్లని నీటితో స్నానం చేసేవాడిని. అప్పుడు నాకు సోదరి సెయింట్ థెరిస్సా వాక్యాలు గుర్తు వస్తుండేవి. "ప్రియమైన భగవంతుడా! ప్రతి రోజు నాకు ఏదయినా చేయడానికి పని ఇవ్వు, దాని వలన నా బుద్ధి బాగుంటుంది. కొద్దిగా బాధను కూడా ఇవ్వు. అది నా ఆత్మను పరిశుద్ధంగా ఉంచుతుంది. కొద్దిగా మంచిని ఇవ్వు. దాని వలన నీ హృదయం సుఖంగా ఉంటుంది." నేను కూడా నన్ను నేను ఆశ్రమ కార్యకలాపాలతో పాలు పంచుకొని పని కల్పించుకొనే వాడిని. నిరంతరము ప్రార్థనతో ధ్యానంతో కాలంగడపడము కష్టము కదా! అందువలన మనకి కొంత పనిచేయడం కూడా చాలా అవసరం. అలాగే కొద్దిగా ఇబ్బందులు కూడా మనలను మనము పరిశుద్ధులము గావించుకోవడానికి అవసరము. దాని వలన మనము భగవంతునికి దగ్గరగా ఉంటాము, అలాగే మంచి పనులు చేయటం వలన అది మన ఆత్మానుభవానికి ఎంతో ఉపకరించి, ఉన్నతస్థితిని చేర్చి ఆనందంగా ఉండేలా చేస్తుంది.

పనిచేస్తున్నప్పటికీ నేను సంతోషంగా, ఆరోగ్యంగా ఉన్నాను. నా ముప్పై రోజుల ఉపవాస దీక్ష పూర్తి అయ్యేపరకు ఇదే విధంగా ఉండాలని కోరుకుంటున్నాను. నా ఆలోచనలు ఏ విధంగా రూపుదిద్దుకొన్నాయంటే, నేను దృఢంగా, శక్తివంతంగా తయారవడానికి దానిపై ధ్యానం చేయాలనుకుంటున్నాను. మానవుడు తాను దేనిని సంకల్పిస్తాడో, అదేవిధంగా తయారవుతాడు. మనము దేని గురించి ఆలోచిస్తామో, దేని పైన ధ్యానం చేస్తామో, అతి తొందరలోనే లేదా నెమ్మదిగా అయినా దానిగా మారుతాము.

ఉపవాసదీక్ష చేసేటప్పుడు సాధారణంగా బలహీనత ఏర్పడుతుంది. అయినా ఆధ్యాత్మిక శక్తి లేదా విశ్వ శక్తి తోడుగా ఉంటుంది. ఎవరయినా బలహీనత వల్ల కాక ఆధ్యాత్మిక శక్తి ద్వారానే భగవంతుని తెలుసుకోగల్గుతారు. అసాధారణ మయిన ఆధ్యాత్మికశక్తి వల్ల మాత్రమే అదిసాధ్యపడుతుంది. విశ్వప్రేమ, ఆనంతమయిన ప్రశాంతత మనకు లభిస్తాయి. నేను నిరంతరము దైవానికి చేరువుగా ఉన్నప్పటికీ తరుచుగా నేను శ్రీ రామకృష్ణ పరమహంస పలికిన అందమయిన మాటలను గుర్తు

చేసుకునే వాడిని. "ఇంకొక రోజు వృథాగా గడిచిపోయింది. కానీ మాతా నీ దర్శనం ఇంకా నాకు లభించనే లేదు."

కబీర్‌దాసు అనేవాడు "రోజు గడిచిపోయింది రాత్రి కూడా వృథాగా గడిచిపోయింది భగవాన్! నీ దర్శనం కల్గచేయి" అలాగే క్రీస్తు మాటలు కూడా నేను గుర్తుకు తెచ్చుకునేవాడిని. "స్వర్గ రాజ్యం నీలోనే ఉంది" అదే విధంగా మన పూర్వీకులయిన ఋషులు, సాధు మహాత్ములు సత్యదర్శనం చేసిన మహాత్ములు, వేదాలు, ఇతర పవిత్ర గ్రంథాల్లో చెప్పిన మాటలు గుర్తుకు వస్తుండేవి.

ఈ విధమయిన ఆలోచనలు చుట్టుముట్టగా నాలో అంతర్యామిగా కొలువైన ఈశ్వరుడు నన్ను మేల్కొలుపుతూ నెమ్మదిగా ఇలా తెలియచేశారు. "నా మీద విశ్వాసం ఉంచు. ఎందుకు నీవు నన్ను మర్చిపోతూ ఉంటావు. నేను ఎల్లప్పుడూ నీతోనే ఉన్నాను. నీ శరీరంలోని అణువణువులోనూ కలిసిపోయి ఉన్నాను. జాగ్రత్తగా గమనించు. నేను ఎల్లప్పుడూ ఒక్కటిగానే ఉన్నాను తప్ప రెండుగా లేను. గమ్యం లేని వెతుకులాటలు మానివేసి ప్రశాంతంగా, సంతృప్తిగా నాతో ఉండు. నేను నిరంతరం నీతోనే ఉన్నాను. నీ జీవితము పూర్తి అయ్యేవరకు నీతోనే కలిసి ఉంటాను". అందువలన లోపలా, బయటా అంతటా పరమాత్మ సన్నిధిని అనుభవిస్తూ నేను మౌనంగా, ప్రశాంతంగా, సంతోషంగా, సంతృప్తిగా ఉంటూ అన్ని చింతలు, చికాకులు, వ్యథలు, రొదలు వదిలిపెట్టి రోజులు గడపసాగాను. పరమాత్మ సర్వాంతర్యామి. అతనికి గతం లేదు. భవిష్యత్తు లేదు, వర్తమానము లేదు. కాలానికి, ప్రదేశానికి ఆయన అతీతుడు.

మన మానసిక, ఆధ్యాత్మిక స్థితిని బట్టి, ఆయా విధమయిన ధ్యానములు ఆయా సమయాల్లో సహాయకారిగా ఉంటాయి. సూర్యాస్తమయ సమయంలో ఆకాశం క్రింద లేలేత సూర్యకిరణాలతో స్నానమాడుతూ గాఢమయిన ధ్యానములో మునిగిపోయి విశ్వ శ్వాసలో గడిపేవాడిని. ఎలాంటి ఎడబాటు లేకుండా మన హృదయానికి ఎంతో దగ్గరగా ఉండే ఆ పరమాత్మను ధ్యానించేవాడిని. సూర్యకిరణాల ద్వారా అంతులేని అనంతమయిన శక్తి శరీరానికి అంది ఉత్తేజపరిచేవి. భగవంతుడు సూర్యకిరణాలకి ఆత్మగా వెలుగొందుతున్నాడు. శ్వాసలో శ్వాసగా, జీవితానికి జీవితంగా, ఆత్మలో ఆత్మగా నివసిస్తున్నాడు. 'సోహమ్' అనే విశ్వ శ్వాస ద్వారా పరమాత్మను దర్శించాలి. అదే సూర్యకిరణాల ద్వారా ప్రతి హృదయాన్ని తేజోవంతం చేస్తుందని గ్రహించాలి,.

ఆత్మానుభవమే నా జీవిత లక్ష్యము, నాకు ప్రియమయిన ఆలోచనలు, ఆత్మ సాక్షాత్కారము అంటే అది చిన్న విషయం కాదు. చాలా ఉన్నతమయిన స్థితి. ఆత్మ దర్శనం అంటే నిన్ను నీవు సంపూర్ణంగా భగవంతునికి శరణాగతి చెందటము. అదే సత్య దర్శనము. ఆత్మ దర్శనము, భగవదనుభవము రెండూ వేరు వేరు కాదు. అవి రెండూ ఒక్కటే.

దీక్షా కాలంలో ఇరువై అయిదవ రోజున ఆశ్రమ వాసులు నా క్షేమం కోరి వైద్యుడిని నన్ను పరీక్షించటం కోసం పిలిపించారు. దీర్ఘకాలం ఉపవాస దీక్షలో ఉండటం వలన శరీరంలో బలహీనత ఏర్పడుతుంది అని వారు ఆందోళన చెందటం సహజమే. వైద్యుడు నాకు చాలా మంచి మిత్రుడు. శాంతి ఆశ్రమానికి మంచి భక్తుడు, ఆధ్యాత్మికంగా మంచి వ్యక్తి కూడా. నేను ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉన్నాను. అందువలన నేను అతడిని నన్ను ముట్టుకొని నా నాడిని పరీక్షించడానికి గాని, ఎలాంటి వైద్య పరీక్షలు జరపడానికి గాని అనుమతించకుండా సున్నితంగా అతడిని తిరస్కరించాను. కనీసం గుండె ఎలా కొట్టుకుంటుందో కూడా చూడనీయలేదు. దయచేసి నా సమయాన్ని వృథా చేయవద్దు అని అతనికి వ్రాసి చూపించాను. నేను చాలా ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉన్నానని తెలియచేశాను. దానితో అతడు తృప్తి చెందాడు. ఎలాంటి వైద్యపరీక్షలు చేయకుండానే వెనుతిరిగి వెళ్ళిపోయాడు. ఆయన నా వంక ఎంతో భక్తితో, ఆరాధనతో చూచాడు. అంతా ఆ భగవంతుని లీల. విశ్వంలోని ధార్మిక శక్తిని ప్రసాదించి నన్ను మరింత దృఢంగా, ఆరోగ్యంగా తయారుచేసినందుకు భగవంతునికి కృతజ్ఞతలు తెలియచేసు కుంటున్నాను.

భగవంతుడు జీవుని ప్రతి అణువులోనూ కొలువై ఉన్నప్పుడు, అతని శరీరంలో అంతర్యామిగా నెలకొని ఉండగా అసలు అతడిని పరీక్షించవలసిన అవసరం గాని, తెలుసుకోవలసిన అవసరం గాని ఏముంటుంది? ఎవరికి వారు అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మర్చిపోకుండా ఉండటం అవసరం అని గ్రహించాలి. ఉన్నతమయిన స్థాయికి చేరుకున్న వారే ఉత్తమ అధికారులు అవుతారు. అలాంటి వారు తమని తామే పరీక్షించుకోవాలి తప్ప వారిని ఇతరులు పరీక్షించడానికి అర్హులు కారు. ఎవరికి వారు ఆత్మావలోకనం చేసుకుని తమని తాము సరిదిద్దుకోవాలి. అలాగే ఆరోగ్యపరంగా కూడా వచ్చే ఇబ్బందులను అధిగమించగలగాలి. నిన్ను నీవే సక్రమమయిన పద్ధతిలో మనస్సును, శరీరాన్ని అదుపులో ఉంచుకోవాలి. అందువలన ఎవరికి వారే నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. వారికి వారే ఉత్తమమయిన గురువులు లేదా వైద్యులు కాగల్గుతారని.

మహర్షులు పదే పదే మనకు తెలియచేస్తున్నారు. అని మతాల సారాంశము ఆత్మ సాక్షాత్కారమేనని, నిన్ను నీవు తెలుసుకోలేకపోతే, నీ హృదయంలో హృదయంగా, బుద్ధికి బుద్ధిగా, ఆత్మకు ఆత్మగా వెలుగొందుతున్న ప్రకాశిస్తున్న అంతర్యామిని గుర్తించలేకపోతే, ఇంక నీవు ఇతర విషయాలను ఏ విధంగా గ్రహించగల్గుతావు? నీ అంతర్యామి పట్ల నీవు నిజాయితీగా ప్రవర్తించలేకపోతే ఇంక నీవు బాహ్యంలోని ఇతర స్నేహితులతో, బంధువులతో నిజాయితీగా ఎలా మసులుకోగల్గుతావు? అందువలన మహాత్ములు అంటూ ఉంటారు తరుచుగా నీవు నీ పట్ల, నీ లోపల అంతర్యామిగా ప్రకాశిస్తున్న పరమాత్మ పట్ల నిజాయితీగా ఉంటే అంతా సవ్యంగా ఉంటుంది.

బాహ్యంలో గురువులకు, దగ్గరి బంధువులకు, ఆత్మీయులయిన స్నేహితులకు భక్తి విశ్వాసంతో ప్రవర్తించే శిష్యుడిగా తయారు కావటం వలన వారిపై నమ్మకము విశ్వాసం ఉంచటం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. వారు ఎంత నమ్మకమయిన వారయినా, ప్రేమించదగినవారయినా సరే బాహ్య జగత్తులోని వారిపై విశ్వాసము నెమ్మదిగానో, ఆలస్యంగానో సడలిపోయి చివరికి నిరాశ, దుఃఖముగా మారిపోతుంది. ఎందుకంటే ఈ జగత్తు నిరంతరము పరిణామము చెందుతూ ఉంటుంది. మన కాళ్ళ మీద మనం నిలబడవలసిన సమయం వస్తుంది. మన స్వశక్తిపై విశ్వాసం పెంచుకోవాలి. మనలో అంతర్యామిగా ఉన్న దైవంపై ఆధారపడాలి. అంతే తప్ప బాహ్యంలో దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో ఉండే దైవంపై నమ్మకం పెట్టుకుని వారిపై ఆధారపడటం, నామరూపాలపై, స్వర్గ నరకాలపై విశ్వాసం పెంచుకోవటం వలన ఎలాంటి ప్రయోజనము ఉండదు. దేహమే దేవాలయము. మన హృదయంలో కొలువై ఉండే పరమాత్మను దర్శించు. హృదయక్షేత్రమే భగవంతునికి నివాసము. ఈ సత్యాన్ని తెలుసుకోవలసిన సమయం చాలా గొప్పది.

నిజానికి మన జీవితంలో చాలా సామాన్యమయిన విషయాలకు వస్తే, ఏదయినా పనిచేయవలసి వచ్చినపుడు మన పూర్తి శక్తి సామర్థ్యాలను వినియోగించి ఈ పనిని చేసినప్పుడే మనకు సంతృప్తి కలుగుతుంది. చాలా సందర్భాల్లో మనము ఆ పనిని ఇతరులకు అప్పగించడానికి సంకోచిస్తాము. వాళ్ళు దాన్ని సక్రమంగా నిర్వహించగలరో లేదో అని సందేహిస్తాము. అయినా ఎప్పుడయినా మన పని సక్రమంగా చేయడానికి అలసత్వం వహించి ఇతరుల సహాయం తీసుకున్నప్పుడు మనకి తప్పకుండా అనుభవమవుతుంది. చివరికి మనమే దానిని సక్రమంగా పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. అప్పుడే మనము సంతృప్తి చెందగల్గుతాము. ఇతరులు కేవలం మాటలతో సరిపెడతారు తప్ప మనము చేసుకున్నంత సమర్థవంతంగా ఆ పనిని సక్రమంగా చేయరు. ఇదొ ఉదాహరణ మాత్రమే.

**ఆశ్రమ వార్తలు – మన స్వామీజీ ఉపవాసదీక్ష**

మేమందరము భగవంతునికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెల్పుకుంటున్నాము. మా పూజ్య స్వామీజీపై వారు సుదీర్ఘమయిన ఉపవాసదీక్ష సాగించిన సమయంలో అనంతమయిన ఆశీస్సులు అందించి ఆశీర్వదించినందులకు. నెలరోజుల ఉపవాస దీక్ష అనంతరము కూడా స్వామీజీ ఎలాంటి అసౌకర్యము లేకుండా, కనీసం తలనొప్పి, ఆకలిదప్పులు, బలహీనత, అనారోగ్యము లాంటి వాటికి గురికాలేదు. పైగా వారు ఆశ్రమ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్తర ప్రత్యుత్తరాలు చూస్తూ రోజుకు నాలుగైదు గంటలు పనిచేసేవారు.

దీక్షాకాలంలో ఎన్నో సందేశాలు, వ్యాసాలు రచించారు. అవి ఎంతో ఉత్తేజకరంగా ఉండి భక్తులకు, సాధకులకు ఉపయోగపడ్డాయి. అవన్నీ "విశ్వ సంబంధమైన ఉపవాసము" పేరుతో గ్రంథంగా తయారయింది. ముప్పై రోజుల దీక్ష అనంతరము స్వామీజీ అరమైలు దూరంలోని కొండ దగ్గరికి వ్యాహ్యాళికై నడుచుకుంటూ వెళ్ళి అక్కడి ప్రశాంతమయిన, సుందరమైన సూర్యాస్తమయాన్ని తిలకిస్తూ ధ్యానంలో చాలాసేపు గడిపారు.

నెల రోజుల ఉపవాసదీక్ష వలన స్వామీజీ భౌతిక దేహము బాగా సన్నగా తయారయింది. కానీ వారి ముఖమండలం దివ్య తేజస్సుతో ప్రకాశవంతంగా కనబడసాగింది. దీక్షా కాలంలో వారు మౌన దీక్షలో ఉండటం వలన దీక్ష ముగిసిన అనంతరము వారు మొదటిసారి మాట్లాడినప్పుడు వారి గొంతు చాలా చిన్నగా వినబడింది. వారు ఇప్పుడు ఎక్కువగా మౌనంగా, ప్రశాంతంగా, ధ్యానంలో ఎక్కువ సమయం గడుపుతున్నారు.

మరొక పర్యాయము ఆ భగవంతునికి ధన్యవాదాలు. ఆశ్రమవాసులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సులు, ప్రార్థనలు, భక్తి, గౌరవము అన్నీ స్వామీజి విజయానికి సహకరించాయి. స్వామీజీకి ఆ పరమాత్మ ఆరోగ్యాన్ని సుదీర్ఘమయిన ఆయుష్షును ఇచ్చి ఆశీర్వదించాలని, తద్వారా స్వామీజీ వారి శాంతి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించగల్గుతారని ఆశిస్తున్నాము.

* ప్రతిదినము తెల్లవారురుఝామున లేచి విహరిస్తూ ఉన్న లేక ఏపని చేస్తూన్న, మనస్సును ఆత్మయందు నిలుపు. అంతర్ముఖత వదలకు, బహిర్ముఖతవదలి, నిరంతరం మనస్సును అంతర్ముఖం చెయ్యి. చేపలు సముద్రంలో జీవించినట్లు పక్షులు వాయు మండలంలో చరించినట్లు, నీవు ఆత్మజ్ఞాన తేజో మండలంలో జీవించు జ్ఞానంతో సంచరించు. జ్ఞాన స్వరూపుడవై జీవించు.

**స్వామి రామ తీర్థ**

* ఈమానవ దేహం లభించడం నీ అదృష్ట ఫలం. నీశక్తి మేరకు భగవత్ప్రార్థనలలో గడుపు. గట్టిగా శ్రమించాలి. శ్రమించకుండా దేనినీ సాధించలేవు. ప్రాపంచిక వ్యాపకాలలో మునిగి ఉన్నప్పటికి నిత్యం కొంత సమయం ప్రార్థనకు, పారమార్థిక సాధనకు కేటాయించాలి.

**భగవాన్ రమణమహర్షి**

* ప్రార్థన, స్తోత్రం – ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించడానికి ప్రాధమిక సాధనాలు.

**స్వామివివేకానంద**

# అబ్‌తో జీవన్ హారే

**-స్వామి తేజోమయానంద**

## ప్రార్థన ద్వారా సద్గతి కలుగును

స్వాయంభువ మనువు తర్వాత రెండవ మనువు స్వారోచిష మనువు. మూడవ మనువు ఉత్తముడు. చతుర్థ మన్వంతరంలో ఉత్తముని సోదరుడు తామసుడనువాడు మనువయ్యాడు. ఆ మన్వంతరంలో భగవంతుడు హరిగా అవతరించి గజేంద్రునికి మోక్షమిచ్చాడు. ఏనుగుల రాజు గజేంద్రుడు ఒకసారి ప్రమాదంలో పడ్డాడు. ఓడిపోయి చివరకు ఆ గజరాజు భగవంతుణ్ణి ప్రార్థించాడు.

**గజరాజపె విపదా పడీ మనమే జపా జో హరి హరి।**

**గ్రహ మారకె ముక్తి కరీ తుమ్హే యాద్ హో కి న యాద్ హో।**

**జో నామ్ కా ప్రతాప హై తుమ్హే యాద్ హో కి న యాద్ హో।**

గజరాజుకు ఆపద సంభవించినప్పుడు ఆయన హరి, హరి అని ప్రార్థించాడు. అప్పుడు భగవానుడు వచ్చి మొసలి బంధనం నుండి గజరాజును విడిపించాడు. ఇది చాల చక్కని కథ. జీవితంలో ఏమైన కష్టాలు వచ్చినప్పుడు, ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడినప్పుడు ఈ "గజేంద్ర మోక్ష" ప్రసంగాన్ని చదవటం వల్ల ఆ కష్టాలన్నీ తొలగిపోతాయని చెబుతారు. శుకదేవుడిలా చెప్పినప్పుడు పరీక్షిన్మహారాజు శుకునితో "మహాత్మా! ఈ కథ నాకు వివరంగా తెలియజేయండి. ఇలా సంక్షిప్తంగా వినటం నాకు సంతృప్తిగా లేదు" అన్నాడు. అప్పుడు శుకదేవుడిలా చెప్పసాగాడు.

**ఆసీద్గిరివరో రాజంస్త్రికూట ఇతి విశ్రుతః।** **(8.2.1)**

క్షీరసాగరంచే పరివేష్ఠితమైన త్రికూటాచలమనునొక పర్వతం కలదు. అక్కడ చాల అందమైన ఉపవనం, ఎంతో విశాలమైన సరోవరం ఉన్నాయి. అక్కడ మహాశక్తివంతుడైన ఏనుగుల రాజు గజేంద్రుడు నివసిస్తూ ఉండేవాడు. సాధారణంగా సింహం ఏనుగును చంపగలిగి ఉంటుంది. కానీ ఈ గజేంద్రుని శక్తికి పులులూ, ఎలుగుబంట్లూ, సింహాలూ మొదలైన జంతువులన్నీ భయపడుతూ ఉండేవి. ఈ గజేంద్రుడెవరిని దయ తలిస్తే వారు నిర్భయంగా జీవించగలిగేవారు. ఆడ ఏనుగుల సమూహం ఆ గజేంద్రుని వెంట నడిచేది.

ఒక రోజు జరిగిన సంగతి. గజేంద్రుడు తనదైన మదంతో మత్తులో అడవిలో ఎక్కడికో వెడుతూ ఉన్నాడు. వెడుతూ వెడుతూ చెట్లను పెళ్ళగించి విసిరివేస్తూ ఉన్నాడు. ఎందుకంటే తన బలం పట్ల ఆ గజేంద్రునకు అంతులేని అహంకారం. విశాలమైన సరోవరాన్ని చూడగానే గజేంద్రుడు స్నానం చేయటానికి అందులో దిగాడు. ఆ రోజు చాల ఎండ వేడిమిగా కూడ ఉంది. తోటి ఏనుగులన్నింటికీ

దాహం వేయసాగింది. సాగరమంత విశాలమైన ఆ సరోవరంలో విధివశాత్తూ చాల విశాలకాయంగల భయంకరమైన మొసలి ఒకటి నివసిస్తూ ఉండేది. ఏనుగు నేలపై నివశించే జంతువు. అందువలన నీటిలో దానికి ఎక్కువ శక్తి ఉండదు. కానీ మొసలి నీటిలోనే నివశించే జంతువు. ఆ మొసలి గజేంద్రుని కాలు పట్టుకొని క్రిందికి లాగివేయసాగింది. గజేంద్రునికి తన బలంపై ఎంతో నమ్మకం. తన శక్తినంతా ఉపయోగించి తనను తాను రక్షించుకొనే ప్రయత్నమంతా చేశాడు కానీ రక్షించుకోలేకపోయాడు. తోటి ఏనుగులు, ఆడ ఏనుగులు అన్నీ కలసి కూడ ఆ గజేంద్రుని బయటకు లాగటానికి ప్రయత్నించాయి గానీ ఏమీ లాభం లేకపోయింది. అప్పుడా గజేంద్రుడిలా ఆలోచించసాగాడు–

**స మామిమే జ్ఞాతయ ఆతురం గజాః**
**కుతః కరిణ్యః ప్రభవంతి మోచితుమ్।**
**గ్రాహేణ పాశేన విధాతురావృతో**
**2ప్యహం చ తం యామి పరం పరాయణమ్।। (8.2.32.)**

ఈ బలగమంతా కూడ నన్ను రక్షించలేదు. మనకు కూడ మొదట మన బలంతోనే అన్నీ చేసేయగలమనిపిస్తుంది. గజేంద్రునికి కూడ మొదట తన బలంతోనే తనను తాను రక్షించుకోగలననిపించింది. కానీ అలా రక్షించుకోలేక పోయినప్పుడు బంధువులు లేక తన స్వజనులు తనను రక్షించగలరనుకొన్నాడు. కానీ వారందరూ కూడా విడిపించలేకపోయారు. ఒక జీవుడు తనను రక్షించటానికి మరొక జీవుని ఆశ్రయిస్తే ఏమి లాభం? చివరికి మరిక ఏ అల్పశక్తిగలవారినీ ఆశ్రయించి లాభమేమి లేదని తెలుసుకొన్నాడు. సర్వ శక్తిమంతుడైన భగవంతుడే నన్ను రక్షించగలడు. మరెవ్వరూ నన్ను రక్షించలేరు, ఎవ్వరిలోనూ అటువంటి శక్తి లేదు కావున నేనా భగవంతుణ్ణే శరణు వేడతాననుకొన్నాడు.

'గజేంద్రుడు భగవంతుని శరణు వేడే బదులు మొసలినే ఎందుకు శరణు కోరకూడదు? తనను తాను విడిపించుకోవాలంతే గదా? గజేంద్రుడు మొసలితో నేను నిన్ను శరణుజొచ్చాను. నన్ను వదలిపెట్టు అంటే మొసలి వదలి వేసేది కదా!" అని ఒక వ్యక్తి నన్నడిగాడు.

మొసలి గజేంద్రుని వదలివేస్తుందని ఖచ్చితంగా ఏమీ చెప్పలేం. రెండో విషయమేమంటే మొసలి కూడ ఒక జీవే. జీవుణ్ణే శరణు కోరటం వల్ల లాభమేమిటి? అలా ఎందుకు చెయ్యాలి? మహా అయితే మొసలి గజరాజును వదలివేయవచ్చు కానీ ఆ మొసలి గజరాజుకు మోక్షాన్నివ్వలేదు. ముక్తుణ్ణి చేయలేదు. గజేంద్రుని మానసిక స్థితి కూడ మారి మొసలి నుండే గాక, ఈ ప్రపంచం నుండే విముక్తి కావాలని భగవంతుణ్ణి ప్రార్థించసాగాడు. మొరపెట్టుకోసాగాడు.

మహాత్ముడు సూరదాసు ఒక అందమైన పదం వ్రాశాడు: **“హే గోవింద హే గోపాల హే గోవింద రాఖో శరణ అబ్‌తో జీవన్ హారే...”**

ఓ భగవంతుడా! నేను నా సంపూర్ణ శక్తినుపయోగించి చూశాను. కానీ ఏమీ ఫలితం లేకపోయింది. “సమాస్తా మమ యుక్తయః” అన్నట్లుగా నాకున్న సమస్త శక్తియుక్తులన్నింటినీ ఉపయోగించి చూశాను. “అబ్ తో జీవన్ హారే” నేనింక సహించలేను. నన్ను నేను రక్షించుకోలేకపోయాను. “సూర కహే శ్యామ్ సునో శరణహై తిహారే”

గజేంద్రునికి తన పూర్వ జన్మ స్మృతి కలిగిందని చెబుతారు. పూర్వజన్మలో తాను భగవంతుణ్ణి ఏ విధంగా స్తుతించేవాడో స్మరించుకొని గానం చేయసాగాడు.

**ఓం నమో భగవతే తస్మై యత ఏతచ్చిదాత్మకమ్।**

**పురుషాయాదిబీజాయ పరేశాయాభిధీమహి॥ (8.3.2)**

**య స్మిన్నిదం యతశ్చేదం యేనేదం చ ఇదం స్వయమ్।**

**యో2 స్మాత్పరస్మాచ్చ పరస్తం ప్రపద్యే స్వయంభువమ్॥ (8.3.3)**

పూర్వ జన్మలో గజేంద్రుడు “ఇంద్రద్యుమ్ను” డనే రాజు. ఒకసారి అగస్త్యుడు వచ్చినప్పుడు ఇంద్రద్యుమ్నుడు భగవదారాధన యందు ధ్యానమగ్నుడై ఉండుటచే మహర్షి రాకను గమనించలేకపోయాడు. అగస్త్యుడాయనను “నీవిక్కడ స్థబ్దుడవై కూర్చుండి ఉన్నావు. నీ బుద్ధి ఏనుగు బుద్ధివలె స్థబ్దమై పోయింది కావున ఏనుగువై పోదువు గాక!” అని శపించాడు. ఆయన శాపంచేత ఇంద్రద్యుమ్నుడు గజమై పాయాడు. కానీ ఆ జన్మలో ఆయన చేసిన స్తోత్రాలన్నీ గుర్తు వచ్చాయి. అందుచేత ఆ స్తోత్రాలతో గజేంద్రుడు శ్రీహరిని ప్రార్థింపసాగాడు –

**నమః శాంతాయ ఘోరాయ మూఢాయ గుణధర్మిణే।**

**నిర్విశేషాయ సామ్యాయ నమో జ్ఞానఘనాయ చ॥ (8.3.12)**

ఇక్కడ ప్రత్యేకమైన విశేషమేమంటే గజేంద్రుడు బ్రహ్మను ప్రార్థించలేదు. మహేశ్వరుణ్ణి కూడా ప్రార్థించలేదు. అందువలన పరమాత్ముడు ఈ గజేంద్రుడు ఏ దేవతనూ ప్రార్థించటం లేదు. నన్నే ప్రార్థిస్తూ ఉన్నాడనుకొన్నాడు. ప్రార్థన వినగానే

**ద్వారకా మే శబ్ద గయో శోర్ భయో భారే।**

**శంఖ – చక్ర – గదా – పద్మ గరుడ లే సిధారే॥**

భగవంతుడు అన్నీ వదలి పరుగెత్తాడు. గరుడుడు ఆయన వాహనం. భగవంతుని త్వరగా తీసుకు వెళ్ళాలని గురుడుడు ఎదురుగా వచ్చాడు. కానీ గరుడుడు కూడా త్వరగా ఎగరటం లేదనిపించింది భగవంతునికి. అప్పుడు శ్రీహరి గరుడుని కూడ వదిలేసి మనోవేగంతో గజేంద్రుని వద్దకు వచ్చాడు. ఎటువంటి విలక్షణ విషయమో!

మనం త్వరగా ఎక్కడికైనా వెళ్ళాలంటే వాహనం తీసుకుంటాం. కానీ భగవంతుడు త్వరగా వెళ్ళాలంటే వాహనాన్ని వదలి వేస్తాడు. ఎటువంటి వేగమాయనిది? భగవంతుడు అక్కడకు పరుగు పరుగున వెళ్ళి ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయక తన సుదర్శన చక్రంతో మొసలిని సంహరించాడు. జాగ్రత్తగా గమనించవలసినవి విషయమేమంటే భగవంతుడు ఎవరిని సంహరిస్తాడో, వారు ఉద్ధరించబడతారు. ఆయన మొసలిని సంహరించాడు అది కూడా ఉద్ధరించబడింది. గొప్ప ఆశ్చర్యమేమంటే గజేంద్రుని ఉద్ధరించటానికంటే ముందే భగవంతుడు మొసలిని ఉద్ధరించాడు. అలా ఎందుకు చేశాడాయన? ఎందుకంటే మొసలి భక్తుని పాదాలు పట్టుకొన్నది. ఇది చాల రహస్యమైన విషయం. దీనిని మనం త్వరగా అర్థం చేసుకోలేము. భక్తుణ్ణి శరణు వేడిన వారిని భగవంతుడు రక్షించటమే కాదు ఉద్ధరిస్తాడు కూడా!

ఈ మొసలి పూర్వజన్మలో "హూహూ" అనే గంధర్వుడు. ఇప్పుడాయనకు పూర్వ దేహం లభించింది. గజేంద్రుడిప్పుడు మొసలి నుండి విడిపించమనే కాక ఈ ప్రాపంచిక బంధనాల నుండి కూడ ముక్తి కలిగించమని ప్రార్థిస్తూ ఉన్నాడు.

మన స్థితి కూడా గజేంద్రుని స్థితి వంటిదే. మనకు మన శక్తిపై చాల అహంకారముంటుంది. మన చుట్టు ప్రక్కలవారు మనలను రక్షిస్తారని మనకు అంతులేని విశ్వాసం. అవసరమొచ్చినప్పుడు వారంతా మనకు తోడుంటారని మన విశ్వాసం. మరో విషయమేమంటే విషయ సుఖాలయందు ఆసక్తిగల ఇంద్రియాల కారణంగానే "నీర పిబన హేతు గయో" మనం కూడా నీరు త్రాగటానికే సరోవరానికి వెడతాం. అనగా సుఖ లబ్ధి కోసమే మన మీ ప్రపంచంలోకి వస్తాం. కానీ ఇక్కడ కాలరూప మొసలి (దానిని కాలరూపమన్నా సరే, కామరూపమన్నా సరే) కూర్చొని ఉన్నది. అది మన కోసం ఎదురు చూస్తూ ఉన్నది. కాలం కూడా మొదటి మనిషి కాళ్ళే పట్టుకుంటుంది. మానవునికి మరణమాసన్నమైనప్పుడు శరీరంలో అన్నింటికంటే ముందు అతని కాళ్ళే చల్లబడతాయి ఎందుకంటే కాలం మొదట కాళ్ళనే పట్టుకుంటుంది. అంత్యకాలంలో కూడా మనం ఆ డాక్టరును పిలు, ఈ డాక్టరును పిలు అంటూ ఉంటాం. ఆక్సిజన్ తీసుకుంటూ ఎందాకా బ్రతికి ఉండగలం? ఆక్సిజన్ తీసుకోవటం వల్ల బ్రతుకుతున్నాడని ప్రజలు అనుకుంటారు. అదే నిజమైతే ఎప్పుడూ ఎవరూ చావనే కూడదు గదా! ప్రకృతిలో ఆక్సిజన్ చాలా లభిస్తున్నది. బ్రతికి ఉన్నంతవరకూ ఆక్సిజన్ ఇస్తున్నప్పటికీ చనిపోయిన తర్వాత అవేమీ పనిచేయవు. వాటిని తీసివేయాలి.

ఈ గజేంద్ర మోక్షం ఏదో సామాన్యమైన కొద్దిపాటి బంధనాల నుండి ముక్తి పొందే విషయం కాదు. ప్రాపంచిక బంధనాల నుండియే ముక్తి పొందే విషయం. వాస్తవానికి ఈ ప్రాపంచిక బంధనాలు మనం భగవంతుని శరణు వేడినప్పుడే పోతాయి.

భగవంతుడు ప్రత్యక్షం కాగానే గజేంద్రుడాయనను స్తుతించాడు. "నీవు స్తుతించినట్లుగా ఎవరు నన్ను పూజించినా, ఉపాసించినా వారి పట్ల నేను సంతృప్తచిత్తుడనవుతాను" అని భగవంతుడు గజేంద్రునికి చెప్పాడు.

# గురువాచక కోవై

మూలం: మురుగనార్ వివరణ: సాయి కృష్ణ

## గురుమహిమ

### గురుకృపచే మనోమర్కటం నశిస్తుంది.

**సత్య జ్ఞానప్రదాయకుడు, ఉజ్వలానంత తేజోసమన్వితాత్మస్వరూపముగా ప్రకాశించువాడు అయిన గురువు ఆద్యమౌనమూర్తి, ఆమౌనము జగద్వ్యామోహ మనెడి వీడని కళంకము కారణముగా ఆవిర్భవించెడి వికృతవాదములను పారద్రోలును.**

గురువు స్వచ్ఛమైన జ్ఞానము నిచ్చువారు. సత్యమైన జ్ఞానము అనగా ఆత్మ జ్ఞానము. గురువు ఎప్పుడూ ఆత్మగురించి, ఆత్మజ్ఞానం గురించే మాట్లాడుతారు. ఆయన ఎప్పుడూ ఆత్మ నిష్ఠలోనే ఉంటారు. మౌనమూర్తి. ఎంతో మంది భగవాన్ దగ్గరకు ఆయనను కించపరచాలని, అవమాన పరచాలని, పరీక్షించాలని వచ్చారు. వారు వికృతచేష్టలు చేసేవారు. శాస్త్రాలను బాగా చదువుకున్నవారు. ఉపన్యాసాలను ఇచ్చేవారు. లౌకిక ప్రపంచంలో ఎన్నో మన్ననలను పొందుతున్న వారు. శిష్యులను కలిగిన వారు. కాని వారు చెప్పేది తమ జీవితంలో ఆచరించరు. లౌకిక గౌరవములతో వారిలో అహంకారం పెరుగుతుంది. భౌతిక సత్కారాలతో వారిలోని అహం ఆనందపడుతూ ఉంటుంది. కాని వారికి శాంతి లభించదు. వారు పొందుతున్న గౌరవసత్కారాలు శాశ్వతమనుకుంటారు. అటువంటి వారు భగవానునితో వాదించడానికి వచ్చే వారు. కాని భగవానులు వారిని చూసి స్పందించేవారుకాదు. ఆయనకు అహంకారం (మనస్సు) లేదు. కనుక శరీరమనే భావన లేదు. మనస్సు స్పందించదు. వాదించేవారు వాదించి వాదించి నిశబ్దులవుతారు. భగవానుని చూపు వారి మీద పడినపుడు వారిలో అహంకారం బాగా అణిగిపోతుంది. ఈయన ఆత్మానుభవం పొందిన శాంతమూర్తి, మౌన మూర్తని తెలుసుకుంటారు. ఇదే అద్భుతమయిన స్థితి అని తెలుసుకుంటారు. భగవానుని మౌనంతో వారి అహంకారం అణిగి, ఆయన సన్నిధిలో శాంతిని పొంది భగవాన్‌ను క్షమాపణలు వేడతారు. భగవాన్ "ఎవరు ఎవరిని క్షమించాలి? ఉన్నది అందరిలో ఒకే ఆత్మ కదా"! అంటారు. ఆత్మద్రోహం చేసుకోకుండా మీస్వరూపమును తెలుసుకొండి. మీకు మీరు మేలు చేసుకొండి. భ్రమలో వుండకండని బోధించేవారు.

**వాస్తవముగా లేని వాడైనను ఉన్నవానివలె తోచెడివానిని, గురువు తన నేత్ర ద్వయముతో చంపకయే తత్కాలములో చంపును. అంతట 'లేనిది' 'లేనిది' గా మాయమైపోవును; పరమార్థ జ్యోతిగా ఉన్నది 'ఉన్నది' గా ప్రకాశించును.**

నిజానికి అహంకారం లేదు. ఉంటే ఎప్పటికీ పోదు. అహంకారం కాసేపు ఉంటుంది, కాసేపు ఉండదు. అహంకార మంటే మనసే. జాగ్రత్ స్వప్నములలో తనకి ఉనికి ఉంటుంది. కానిగాఢనిద్రలో మనసు ఉండదు. ఆత్మ ఒక్కటేఎప్పుడూ

ఉంటుంది. నిజంగాలేని అహంకారము (మనస్సు) ఉన్నదానివలెనటిస్తుంది. శరీరంతో ఏకమయి ఎంతో వ్యవహారం చేస్తు ఉంటుంది. గురువు దగ్గరకు వెళ్ళినపుడు మనసు ఎంతో ప్రశాంతత పొందుతుంది. గురువు అనంత శాంత సముద్రుడు. ఆ శాంతి సముద్రము దగ్గరకు వెళ్ళినపుడు మన మనసులు కూడా తాత్కాలికంగా లయమయి పోతాయి. కాసేపయినాప్రశాంతత అనుభవానికి వస్తుంది. లేని మనసు లేనిదిగా తోచి, ఉన్న ఆత్మ తెలుస్తుంది. ఆలోచనారహిత స్థితి వస్తుంది. లేని అహంకారం లేనట్లుగా, ఉన్న ఆత్మ, శాంతి ఉన్నట్లుగా మనకి తాత్కాలికంగానైనా అనుభవానికి వస్తుంది. ఇది గురువు యొక్క సన్నిధిలోనే కలుగుతుంది.

**ముందుగా తన మనఃపిశాచి శిరశ్ఛేదయొనర్చి యున్నవాడు, దైవదత్త సత్యజ్ఞాన ఖడ్గ చాలననిపుణుడు అయిన ధీరుని అనుగ్రహ శక్తి ద్వారా, విశృంఖల వృత్తి యైన మనోమర్క టము యొక్క వికృత చేష్టలు అంతము కానంతవరకు హృదయములో అద్భుత జ్ఞాన తాండవానుభవము పొందుట అసంభవము.**

గురువు ముందుగా తనలోని అహంకారమనే పిశాచి తల నరుకుతారు. ఆత్మజ్ఞాన మనే కత్తినితిప్పే సామర్థ్యము గురువుకు కలదు. మనసనే కోతి వికృతచేష్టలను ఆయన ఖండిస్తారు. మనసనే కోతిని ఖండించే వరకు మనకు అద్భుతమైన ఆత్మానందం లభించదు. మనంసాధన చేయగా చేయగా సద్గురువు మన మనస్సునే కోతిని తన జ్ఞాన ఖడ్గంతో వధిస్తాడు. గురువు అనుగ్రహం వలననే మన మనోమర్కటం నశిస్తుంది. అప్పుడేమనకు శాశ్వత ఆనందం కలుగుతుంది.

**వాస్తవముగా అజ్ఞానమనెడి నిద్రనుండి ఆవిర్భవించెడి స్వప్నమే అయినట్టి జాగ్రదవస్థలోనే శిష్యునికి గురువు గోచరించినప్పటికి, శిష్యుని కప్పియున్న అజ్ఞానము తొలగి, అతనికి జ్ఞానము సిద్ధించును. దీనిని ధ్రువపరచు దృష్టాంతముకలదు: కలలో సింహమును చూచిన ఏనుగు–ఆ కల నిద్రలో నుండి పుట్టినదే–నిద్రాభంగమై మేల్కోనునుకదా!**

మన జాగ్రదవస్థ కూడా స్వప్నమేనని భగవాన్ అంటున్నారు. మనం ఈస్వప్నం నుండి మేల్కో వాలి. స్వప్నంలో ఎన్నోదృశ్యాలు చూస్తు అవి నిజమేనని అనుకుంటూ ఉంటాము. ఈ స్వప్నమును మనసే సృష్టించుకొని అందులోని సుఖాన్ని దుఃఖాన్ని అనుభవిస్తూ ఉంటుంది. మనం మన దుఃఖ నివృత్తికి, శాంతిని పొందడానికి ఒక ఆధ్యాత్మిక గురువును ఆశ్రయించి ఆయనబోధలు వింటూ ఉంటాము. గురువు ఈ జాగ్రదావస్థలో అనుభవించే సుఖదుఃఖాలన్నీ కూడ కలతో సమానమైనవని బోధిస్తారు. మనకు ఈవిషయం అంత తొందరగా అర్థమయి వంటపట్టదు. కాని గురు బోధ వింటూ వింటూ, సాధన చేస్తూ చేస్తూ వుంటే అప్పుడు ఈ జాగ్రదవస్థ కూడా స్వప్నము వంటిదేనని ఎప్పటికో అనుభవానికి వస్తుంది. అప్పుడు నీవు ఈ అజ్ఞాన ప్రపంచంలో వుండవు. ఏనుగుకు కలలో సింహము కనబడితే బెదరి మేల్కొని

మరలనిదురపోదు; కలలో మరల సింహము కనబడుతుందేమోనని. గురుబోధచేత మేల్కొని వున్నప్పుడు చూసే ప్రపంచము, చేసే వ్యవహారాలు, కలిగే అనుభవాలు కల వంటివే. ఇవి తాత్కాలికమే అని తెలుస్తుంది. కలదితక్కువ సమయము, కాని జాగ్రదవస్థలో మనము చూసే ప్రపంచము ఎక్కువ సమయము ఉంటుంది. అంతే తేడా! ఇంతకన్న ఇంకేమీలేదని మనకు తెలుస్తుంది. జాగ్రదవస్థ కూడా స్వప్నమేనని ఆత్మానుభవం అయినపుడు మనకు తెలుస్తుంది. గురువు బోధ చేస్తున్నా, మనము సాధన చేస్తున్నా ఈ జాగ్రదవస్థ అనుభవాలు కలవంటివని మనకు తొందరగా పట్టుపట్టదు. సాధన చేయగా చేయగా, గురువు సన్నిధిలో, భగవంతుని అనుగ్రహం వలన నేను ఆత్మను అనేటటువంటి భావం గట్టిపడుతుంది. నేను, గురువుగారు, ప్రపంచము కూడా ఆత్మ ధరించిన ఒక రూపము మాత్రమే, ఆత్మ యొక్క మాయాశక్తి చేత ఈ జాగ్రదవస్థలో ప్రపంచము గోచరించుచున్నది. నేను ఈ శరీరంకాదు, మనస్సుకాదు, సర్వవ్యాపకమయిన ఆత్మను అని అనుభవానికి వస్తుంది. ఈప్రపంచము కూడా ఆత్మకన్న భిన్నం కాదు అని అర్థమవుతుంది. దానికి, నాజీవితాశయము ఆత్మానుభవము పొందటమేనన్న గట్టి పట్టుదలతో సాధనచేయాలి. అప్పుడు అద్వైతస్థితి కలుగుతుంది. చీమమొదలు కొని సర్వజీవరాశి ఆత్మస్వరూపమే అనే అనుభవంవస్తుంది. అటువంటి స్థితిలో ఈ జాగ్రదవస్థకూడా స్వప్నమే అని తెలుస్తుంది. ఏనుగుకు ఒకసారి కలలోసింహము కనబడినపుడు మరల నిద్రపోవడానికి ఎలా నిరాకరిస్తుందో అటులనేనీకు ఒకసారి ఇందంతా కలని అనుభవంలోకివచ్చి నీవు ఈ ప్రపంచము నిజమని అనుకోవు. అపుడు ఈ ప్రపంచము గురించి ఆలోచించడం జరగదు. ఇది గురుబోధ, సాధన ద్వారానే సాధ్యము.

**పులికోరలలో జిక్కిన లేడి వలె, జ్ఞానప్రదాయకమగు సద్గురుని కటాక్ష వీక్షణము నందు చిక్కిన వారు ఎన్నటికిని విడువబడరు. వారు తమ పరిచ్ఛిన్న స్వరూపమయిన జీవభావమును పొగొట్టు కొనక తప్పదు. వారు ముక్తి పొందక తప్పదు.**

ఒకసారి మనము గురువు దగ్గరకు వచ్చిన తరువాత గురువును సంపూర్ణ శరణాగతి పొందాలి. ఇది కూడ అంత తేలికకాదు. కాని క్రమంగా సాధన ద్వారా సాధ్యమవుతుంది. గురువు చెప్పిన మాటలు విని, నేర్పిన సాధన చేసి, ఆయన మాటలు యదార్థమనే పరిపూర్ణనమ్మికతో ఉండాలి. అప్పుడు గురువు అనుగ్రహంమనకు దొరకుతుంది. గురువు అంటే ఆత్మయే. గురువు అనుగ్రహం పొందిన తరువాత, శిష్యుని వ్యక్తి త్వము, పులినోటిలోపడిన మాంస ఖండం వలె, ఆత్మలో కలిసి పోతుంది. శిష్యుని అహంకారము, జీవ భావము, అహంభావము, వ్యక్తిత్వము నశిస్తుంది. అయితే గురువు యెడల నిర్లక్ష్యం కూడదు. గురువు అనుగ్రహం పొందాలి అంటే మనం గురువుకు సంపూర్ణ శరణాగతులమవ్వాలి. దానికి కూడా సాధన, గురువు మీద విశ్వాసం ఉండాలి.

(సశేషం)

# శ్రీ తులసీ సర్వస్వము

జి.వి.ఎస్. సుబ్రహ్మణ్య శర్మ

## తులసి మాల ధరించిన పవిత్రత కలుగును

**(జూలై సంచిక తరువాయి)**

### కె. హరికి సమర్పించిన తులసీమాలాధారణవైశిష్ట్యము

**నిర్మాల్యతులసీ మాలాయుక్తో శ్చార్చయే ద్ధరిమే**
**య ద్యత్ కరోతి త త్సర్వ మనంతఫలదం భవేత్॥ (అగస్త్యసంహిత)**

తా॥ భగవంతునివద్ద ఉంచి, పూజాదికములను నిర్వర్తించి, నిర్మాల్య రూపమున పైకి తీసిన తులసీమాలతో ఎవడు శ్రీమహావిష్ణువును అర్చించునో అతడు చేసిన పని అంతయు మిక్కిలి ఫలమును ఇచ్చుచునే యుండును.

**శ్లో॥ యే కంఠలగ్న తులసీనళినాక్షమాలాః**
**యే వా లలాటఫలకే లసదూర్ధ్వపుండ్రాః॥**
**యే బాహుమూలపరిచిహ్నితశంఖచక్రాః॥**
**తే వైష్ణవాః భువన మాశు పవిత్రయన్తి॥** (నారదపురాణము)

తులసిపూసలకంఠమాలను ధరించినవారును, ముఖము మీద ఊర్ధ్వ పుండ్రములు కలవారును, బాహువుల మొదట శంఖచక్రములను చిహ్నములుగా ధరించిన వారును, అగు ఆ పురుషులు శ్రీవైష్ణవు లగుదురు. వారు పాదప్రచారములతో లోకముల నన్నింటిని పవిత్రము చేయుదురు. అని నారద పురాణము పేర్కొనుచున్నది.

**శ్లో॥ తులసీకాష్ఠనిర్మాణమాలాం గృహ్ణాతి యో నరః ।**
**పదేపదే 2 శ్వమేధస్య లభతే నిశ్చితం పదమ్॥**

తా॥ ఏ మానవుడు తులసి కర్రతో నిర్మింపబడిన మాలను ధరించునో (స్వీకరించునో) అతడు, అడుగడుగునను అశ్వమేధ యాగమును చేసినవారు పొందు దివ్య పదమును నిశ్చయముగా పొందగలడు.

### యల్. శ్రీ తులసీమాలను ధరించిన వారికి నమస్కరింపవలెను

వైష్ణవులు తులసీమాలను ధరింపవలెనని తెలిసికొంటిమికదా! ఆ తులసీ మాలను ధరించినవారిని ఇతరు లెట్లు గౌరవింపవలెనో విష్ణుధర్మోత్తర, స్కాంద పురాణములు ఇట్లు పేర్కొనినవి.

**శ్లో॥ తులసీకాష్టమాలాశ్చ కంఠే ధారయతీహ యః**
**అప్యనాచార సంయుక్తో మామే వైతి న సంశయః॥ (విష్ణుధర్మోత్తరము)**

**తులసీదళజాం మాలాం కంఠస్థాం వహతే చ యః।**
**విష్ణూత్తరం విశేషేణ స నమస్యో దివౌకసః॥** (స్కాందపురాణము)

తా॥ తులసి కర్రతో చేసిన మాలలను కంఠమునందు ధరించినవాడు ఎంతటి అనాచారుడైనను నిస్సంశయముగా అతడు నన్ను చేరును.

తులసీదళముతో తయారు చేయబడిన, ప్రత్యేకించి విష్ణు ప్రసాదరూపమైన తులసీమాలను కంఠమునందు ధరించినవాడు దేవతలచే కూడ నమస్కరింపదగిన యంతటి పుణ్యాత్ము డగును అని విష్ణుధర్మోత్తరమును, స్కాందపురాణమును తెలుపుచున్నవి.

## ఎమ్. తులసీజపఫలము

తులసీదేవిని సేవించుట దుర్లభము. తులసీని పూజించునట్టి సజ్జనులతోడి సాంగత్యము లభించుటకూడ దుర్లభము. త్రికాలములయందు (నిత్యము) తులసీ! తులసీ! అని ఎవడు జపించునో ఆ బ్రహ్మణుడు రోజునకు వెయ్యి ఆవులను దానము చేయుటవలన కలిగెడు ఫలితమును పొందును. అని గరుడపురాణము చెప్పుచున్నది.

## ఎన్. తులసీకాష్ఠముతో భగవంతునకు ధూపము

**శ్లో॥ యో దదాతి హరే ర్ధూపం తులసీకాష్ఠవహ్నినా।**
**శతక్రతు సమం పుణ్యం గో2 యుతం లభతే ఫలమ్॥** (ప్రహ్లాదసంహిత)

తా॥ ఎవడు విష్ణువునకు తులసి కర్రను వెలిగించి ధూపమును వేయునో అతడు వంద యజ్ఞములను చేసిన వానికి వచ్చు పుణ్యముతో సమానమయిన పుణ్యమును పొందును. అట్లే పదివేల ఆవులను దానమిచ్చిన వానికి కలుగు పుణ్యముతో సమానమయిన పుణ్యమును పొందును. అని ప్రహ్లాదసంహిత చెప్పినది.

## ఓ. తులసీకాష్ఠపు గంధమును పీల్చుట

**శ్లో॥ తులసీకాననం దృష్ట్వా యే నమస్కుర్వతే నరాః।**
**తత్ కాష్ఠాంకితకర్ణా యే తే వై భాగవతోత్తమాః।**
**శ్లో॥ తులసీగంధ మాఘ్రాయ సంతోషం కుర్వతే తు యే।**
**తన్మూల ముధృతా యై శ్చ తే వై భాగవతోత్తమాః॥**

(బృహత్‌నారదీయపురాణము)

తా॥ ఏ మానవులు తులసీకాననమును (తులసితోటను) చూచి నమస్కరింతురో ఏ మానవులు తులసికర్రను చెవిపై అలంకారపు గుర్తుగా ధరింతురో, వారే భాగవతోత్తములు. తులసీగంధమును (తులసి కర్రను అరగదీసిన గంధమును) పీల్చి సంతోషపడుదురో, తులసిచెట్టుయొక్క మొదటనున్న మట్టిని తీసి దానితో స్నానము చేసియు, దానిని తిలకముగా ధరించియు, ఆనందింతురో, వారే నిజమయిన భాగవతులు.

# భానుదాస చరిత్రము

**మహాభక్త విజయము**

## మానవజన్మ దుర్లభమైనది

పైఠణ పురమున భానుదేవోపసాకుడగు ఒక బ్రాహ్మణునికి పరమ శివుని అంశచే ఒక పుత్రుడు జన్మించెను. భానుని అనుగ్రహముచే పుట్టిన వాడగుటచే ఆబాలునికీ భానుదాసని పేరుపెట్టిరి. తరువాత ఆ బాలునికి తల్లిదండ్రులు ఉచిత కాలమున చౌలోపనయనములు, వేదాధ్యయనయములు చేసి, విద్యార్జనకై ఒక ఉపాధ్యాయుని వద్దకు పంపిరి. చదువునందు శ్రద్ధలేని ఆపిల్లవాడు, బడిలో ఒక నిముషమైనను కుదురుగా వుండక పారిపోవుచుండెను. ఉపాధ్యాయుడెంత దండించినను, తండ్రి కళ్ళెర్రజేసి కోపించినను, తల్లి పప్పుబెల్లములు పెట్టి లాలించి మంచి మాటలు చెప్పినను, ఆబాలుడు పాఠములు చదువక ఎల్లప్పుడు ఆటలయందే ఆసక్తి చూపుచుండెను.

ఒక రోజు తండ్రి తీవ్రముగా కోపించగా ఆబాలుడు ఎవరికి చెప్పక అడవిలోనికి పరుగెత్తుకుని పోయెను. పోయి అరణ్యములోని ఒక పర్వతమునెక్కి, అందున్న గుహ లోనికి వెళ్ళెను. అచట విగ్రహరూపమున నున్న సూర్యనారాయణమూర్తికి సాష్టాంగ ప్రణామము చేసి నిలువబడెను. తన అనుగ్రహముతో జన్మించిన ఆ బాలుని అనుగ్రహించవలెనని, సూర్యనారాయణుడు మనుష్యరూపమును దాల్చి, ఒక గిన్నెతో ఆవుపాలను యిచ్చెను. నాయనా! నీవు ఎల్లప్పుడు శ్రీ పాండురంగని భజన చేయుము. ఆ దేవదేవుని పూజంచిన నీవు అందరిచే గౌరవించబడుదువు. ఆ దైవశిఖామణిని ఉపాసించి ధృవుడు అతిగొప్పపదవిని పొందెను. ఆ జగదీశుడు తన భక్తుడగు ప్రహ్లాదుని కొరకై స్తంభమునుండి వచ్చి, అతని మాటను నిజము చేసెను. బలిచక్రవర్తికి యీ కల్పానంతరము దేవేంద్రపదవిని పొందు వరమునిచ్చి, ఇప్పటికిని అతని వాకిలి ముందు కావలి వుండి అతనిని రక్షించుచున్నాడు. ఆ సర్వాత్మకుడు తన భక్తుల కొరకు చేసిన అద్భుతకార్యములు లెక్కలేవు. నీవు విఠల నాధుని భక్తితో భజన చేయుము.

ఆ భజన విధానమును వినుము. నాలుకచే కేశవుని కీర్తించుము. చెవులతో అచ్యుతుని దివ్య చరిత్రము వినుము. కన్నులతో శ్రీ కృష్ణుని దర్శింపుము. పాదములతో శ్రీహరి సన్నిధికి నడిచి పొమ్ము. ముక్కుతో ముకుందుని పాదములపై పడిన తులసిని ఆఘ్రాణించుము. శిరస్సుతో అధోక్షజునకు నమస్కారములుచేయుము ఎన్నో జన్మల నుండి, ఇంద్రియములకు లోబడి సంసారమనే ఎడారులలో దారి తప్పి తిరుగుచున్న నీకు భగవంతుడు ఉత్తమమైన జన్మనిచ్చెను ఈ మనుష్యశరీరముచే దేనినైనా సాధింప వచ్చును. ఈ శరీరము వుండగా, ముక్తిని కోరి భగవంతుని పొందని యెడల, మరల నీకు మనుష్య జన్మము కలుగుట కష్టము. భగవత్సేవకు వుపయోగించుటకే సాధనములుగా ఈ కరచరణ అవయవములుతో కూడిన యీ శరీరము భగవంతుని అనుగ్రహముచే యివ్వబడెను. అట్లు చేయక యితరములకు వుపయోగించిన అది వ్యభిచార మగును. యమదండన తప్పదు. కోరికలనే క్రూరమృగములనుండి

తప్పించుకొని శ్రీవాసుదేవుడనే చెట్టు నీడను చేరి సుఖముగా బ్రతుకుము. నేనిచ్చిన యీ పాలతో నీవు విద్యావంతుడవు అగుదువని ఆశీర్వదించి అదృశ్యుడయ్యెను.

పుత్రుని కానక భానుదాస తల్లిదండ్రులు వారంరోజులు అనేక చోట్ల వెదకి, వెదకించిరి. కొడుకు కనపడ నందున విచారగ్రస్తులైరి. ఇంతలో ఒక బ్రాహ్మణుడు వచ్చి భానుదాస తండ్రితో మీ కుమారుని అడవి మధ్యలోనున్న కొండ దగ్గర చూచితినని, ఇంటికి రమ్మని బ్రతిమాలినా అతడు రానని అనినాడని చెప్పెను. ఇది విని తల్లిదండ్రులు సంతోషించి పర్వత గుహలో భానుదాసను కనుగొనిరి. భానుదాస సూర్యనారాయణ మూర్తి విగ్రహము పాదాలమీద తలనుంచి నిర్భయముగా పడుకొని వుండెను. తల్లిదండ్రులు తమ పిల్ల వానిని కౌగిలించుకొని, ముద్దుపెట్టుకొని, వారముదినముల నుండి తిండి తిప్పలు లేక భయము లేకుండగ నీరసించకుండ యిక్కడ ఎలా వున్నావు అని అడిగిరి. భానుదాస మీరు నన్ను చదువవలెనని బెదిరించినందున నాకు విసుగు వచ్చి యీ అడవిలోనికి వచ్చితిని. ఈ గుహలో యీ విగ్రహమునకు నమస్కరించగా, ఒక దివ్య తేజస్వి, విలక్షణ పురుషుడు వచ్చి నాకు గిన్నెతో ఆవుపాలనిచ్చెను. నాకు హితోపదేశము చేసి అదృశ్యుడయ్యెను. ఆ క్షీరము గ్రోలినది మొదలు నాకు ఆకలి దప్పులు లేవు. సమస్త ప్రపంచము ఈశ్వరస్వరూపమై తోచుచున్నది. నేను, నన్ను కనిపెంచిన మీరు, నాకు తత్త్వోపదేశము చేసిన సూర్యనారాయణుడు, మనమున్న యీగుహ అన్నియు నాకు భగవత్స్వరూపముగా కనబడుచున్నవి. తల్లిదండ్రులారా! ఆ లక్ష్మీనారాయణుడు లేనిచోట లేదు. అతడే నాకు ఆధారము అనుభవనీయమునై యున్నాడు. మీరు నాయందు మమకారము విడచి జగదీశుని భజన చేసిన కృతార్థులగుదురు. మీరు నాకు విద్య నేర్పించవలెనని ఎన్ని ప్రయత్నములు చేసినను అవి ఫలించలేదు. ఇప్పుడు శ్రీసూర్యనారాయణుని అనుగ్రహముచే సకలవిద్యలు నా స్వాధీనములైనవి. భగవంతుడు తలచిన అణువు మేరువగును. చీమ బ్రహ్మయగును. సర్వమును సృష్టించి రక్షించువాడు, పురుషోత్తముడే మనకందరకు తండ్రి కావున మనమందరము ఆ జగజ్జనకుని భజించిన ప్రకృతి వినిర్ముక్తుల మగుదుమని భానుదాస తన గురించి వివరించెను.

భానుదాస తల్లితండ్రులు మనము సూర్యోపాసకులము కావున సూర్యనారాయణుడే ప్రసన్నుడై మన బిడ్డను రక్షించెను. ఆ అనుగ్రహ బలము చేతనే ప్రహ్లాదుని వలె మన పిల్లవానికి కూడ చిన్నతనముననే పూర్తి భక్తిభావము కలిగినదని తలచి, సూర్యనారాయణునికి అనంత వందనములు చేసిరి. భానుదాసను యింటికి తీసుకు వచ్చి తమ పుత్రుని కులదైవముగా తలచుచుండిరి. కాలక్రమములో భానుదాసనకు అనుకూలవతి ఐన యువతితో వివాహమయి సంతానవంతుడయ్యెను. తల్లితండ్రులు పరలోక గతులైరి. భానుదాస సంసారమున చిక్కు కొనక నిరంతరము పాండురంగ స్మరణ చేయుచుండెను.

అతని భార్యాబిడ్డలు అన్నవస్త్రాదులకు యిబ్బంది పడుట చూచి ఆవూరిలో వ్యాపారులు భానుదాసకు ఒక సలహాయిచ్చిరి. మీ తల్లిదండ్రుల జీవించినంతకాలము కుటుంబ భారమును వహించిరి. నీ విపుడు దైవచింతనలో వున్నావు. నీ కుటుంబమునకు

జరుగు బాటెట్లగును? మేము నీకు నూరు వరహాలు అప్పు యిచ్చెదము. వానితో వస్త్ర వ్యాపారము చేసి, ఆ లాభముతో కుటుంబమును పోషించుచు, కొంచెము కొంచెముగా మా అప్పును తీర్చుము అని నచ్చజెప్పి, నూరు వరహాలకు తగు వస్త్రములను కొని యిచ్చి, ఒక వ్యాపారశాలను చూచి, వ్యాపారము చేయు విధానమును కూడ నేర్పించిరి. భానుదాస వ్యాపారము చేయుచున్నను అతని మనసు లాభములను కోరలేదు. తనుకొన్న ధరను చెప్పి దానిపై స్వల్ప లాభమును వేసుకుని అమ్ముచుండుటచే అందరు అతని దుకాణమునకే వచ్చుచుండిరి. కొన్ని దినములలోనే అతనికి అధికలాభములు వచ్చి, అప్పిచ్చిన వారికి వడ్డీతో కూడ అప్పును తీర్చివేసెను.

భానుదాస తన వస్త్ర వ్యాపారముతో బాటు తన వద్దకు వచ్చిన వారికి ఉపదేశములు కూడ చేయుచుండెను. పుండు మీద చుట్టుటకు పట్టుబట్టలు ఎందుకు? హేయమైన యీ శరీరమునకు మంచి వస్త్రములెందుకు? మీరెంత వస్త్రములచే శరీరమును అలంకరించి నను, లోపలనున్న మల మూత్రరక్తాదులు మారవు. శరీర తత్వము తెలియక హేయమైన యీ శరీరమును అలంకరించుట శవాలంకారము వంటిది. ఈ బట్టలుకొను ఖర్చుతో దరిద్రనారాయణులను ఆరాధించిన భగవంతుడు సంతోషించును. ఒక తండ్రికి కలిగిన నలుగురు సంతానములో ఇద్దరు దరిద్రముతో బాధపడుతుండగా మిగిలిన యిద్దరు ధనవంతులై తాము భోగములనుభవించుచు తమ సహోదరులను పట్టించుకొనని యెడల ఆతండ్రి ఎంతో బాధపడును. ఈజగమున అందరు భగవంతుని సంతానము. ఒకరికొకరు అన్నదమ్ములు. మన సోదరులలో అనేక మంది అన్నవస్త్రములు లేక బాధపడుచున్నారు. అందరిని ఆదరించు శక్తి మనకు లేకపోయినను సాధ్యమైనంత వరకు కొందరికైనను తోడ్పడవలెను. ఖరీదైన వస్త్రములను ధరించుట తగ్గించి అట్టి వారికి దేహరక్షణమునకు ఆద్రవ్యమును వుపయోగించుడు మనము దీనులను రక్షించిన మన ఆత్మరక్షణ భారమును భగవంతుడు వహించును. మీకు అధికధనముండిన మంచి వస్త్రములచే భగవంతుని అలంకరించి నేత్రానందమును పొందుడు. దీనజనులు అన్నవస్త్రములు లేక బాధపడుచుండగా, భగవంతుని పట్టు వస్త్రములచే అలంకరించుటకు కూడ జగజ్జనకుడు యిష్టపడడు. పిల్లలు ఉపవాసముండిన తల్లితండ్రులకు అన్నపానములు ఎక్కవు. కావున అన్ని విధములుగా వీలైనంతవరకు బీదవారి బాధలను తీర్చుడు. ప్రపంచమునంతను ఆ భగవంతుని రూపముగానే భావించుడు. మార్పులు చెంది చివరకు నశించు శరీరము నందు అభిమానము విడచి, ఆత్మవిచారణ చేసి మీరక్షణ భారమును భగవంతునికి అప్పగించుడు. పూర్వజన్మ కర్మఫలితముగా యీ జన్మలో మీకు కలిగిన పదార్థముల యందు మమకారము విడచి, మీ కుటుంబ పోషణకు అవసరమగు వాటిని మాత్రము వుంచుకొని, మిగిలినది భగవంతుని కుటుంబమైన ప్రాణుల రక్షణకు వుపయోగించుడు. మనము తల్లిగర్భము నుండి వచ్చునప్పుడు ఏమియు తెచ్చుట లేదు. శరీరము విడచి పోయిన తరువాత ఒక గవ్వ అయినా మనవెంట తీసుకుని పోలేము. ద్రవ్యార్జన కొరకు మనము చేసిన పాపములు మాత్రము మనలను వదలక మన వెంటే వచ్చును. అతని హితోపదేశములు వినుటకు, నిరంతర భగవన్నామ స్మరణ చేయుచు, దీనులకు

అండ అగుచున్నాడని జనులకు అతని యందు శ్రద్ధ అభిమానములు కలిగి అతని అంగడికే ఎక్కువగా వచ్చుచుండిరి అందువలన మిగిలిన వ్యాపారులకు బేరములు లేక భానుదాస యందు అసూయ కలిగెను.

ఒకప్పుడు వర్తకులందరు కలసి సంత నుండి సరుకులు కొని వచ్చుచు దారిలో ఒక దేవాలయములో బస చేసిరి. ఆ రాత్రి ఆ వూరిలో హరిదాసుడను వాడు హరి కీర్తనము చేయుచుండెను. భానుదాస తన మూటలను చూడుడని మిగిలిన వర్తకులతో చెప్పి, హరికీర్తన జరుగుచోటుకు పోయి తానును హరికీర్తన చేయుచు ఆనందించెను. అసూయతో నున్న అతని తోటి వర్తకులు భానుదాస గుర్రమును విప్పి వదలిపెట్టి అతని మూటలన్నిటిని ఒక పాడు నూతిలో పడవేసి తాము నిద్రించిరి. భక్తవత్సలుడైన జగన్నాధుడు బ్రాహ్మణ రూపమున వచ్చి భానుదాస గుర్రమును పట్టుకొని గుడిదగ్గర కూర్చుని యుండెను. దొంగలు వచ్చి నిద్రించుచున్న వర్తకులను బాగుగా కొట్టి, వారి సర్వస్వమును అపహరించుకొని పోయిరి.

మనము అసూయాపరులమై భానుదాసనకు కీడు చేయదలచితిమి. అతని ఆత్మభారము వహించిన పాండురంగడు మనచే అతని వస్తువులను పాడు నూతిలో వేయించి వాటిని భద్రముగా నుంచెను. మనము చేసిన పాపము దొంగల రూపములో వచ్చి మన సొమ్మును అపహరించెను మన మొకటి తలచిన దైవమొకటి తలచును అన్న వాక్యము నిజముగా సత్యము అని వర్తకులందరు విచారించిరి. హరి కీర్తనము ముగిసి భానుదాస వచ్చుసరికి గుర్రమును దక్షించుచున్న బ్రాహ్మణరూపములో నున్న పండరినాధుండు మాయమయ్యెను గుర్రమును యధాప్రకారము కట్టి గుడిలోనికి వెళ్ళిన భానుదాస అంతయు తెలిసికొనెను. ఎట్టి వారికైనను పూర్వకర్మఫలము అనుభవించక తప్పదు నామీద అసూయతో మీరే నా మూటలను నూతిలో వేసి కాపాడితిరి. భద్రపరచుకొనిన మీ సొమ్మును దొంగలు అపహరించిరి. జరిగిన దానికి బాధపడక, జరుగు దానికొరకు ఆశించక దేవుడు ఏ విధముగా మనలను నడిపించిన ఆవిధముగా నడుచుదమని తెలియవలెను. ఇకనైన కర్మలో చిక్కక ముక్తిని పొందుటకు ప్రయత్నించుడు. అని పెద్ద కష్టము కాదు. మీ ఆత్మభారము పండరి నాధునికి అప్పగించి, తక్కిన విషయములను విడచి ఆదేవుని భజన చేయుడు. ముక్తిమీ చేతులో నుండును అని వారికి బోధ చేసెను. నూతిలో పారవైచిన తన మూటలను తీసి వారందరికి పంచియిచ్చి ధైర్యము చెప్పెను. తన గుర్రమును కాచినవాడు పాండురంగడే అని నిర్ణయించు కొనెను చోర భయము లేకుండ గుర్రమును రక్షించితివి. అట్లే కామక్రోధలోభ మోహ మదమాత్సర్యముల నెడు దొంగలకు చిక్కకుండ నాకు నీవిచ్చిన జ్ఞానరత్నమును కాపాడుము. నన్ను మరువక నారక్షణమును చేయుచుండుమని ప్రార్థించెను పైఠన పురమునకు వెళ్ళి తన బట్టల వ్యాపారమును కొంత ధనముతో పిల్లలకు అప్పగించి, మిగిలినది దీనజనులకు వుపయోగించి పండరీ పురమునకు పోయెను. అచ్చట నిరంతరము భగవధ్యానము చేయుచు తన మిగిలిన జీవిత మంతయు గడపి పరమ వైష్ణవ సాయుజ్యమును చెందెను.

(పై కథ “మహాభక్త విజయం” నుండి సరళ భాషలో గ్రహించబడినది)

# గుణపాఠం

చిన్మయా మిషన్

## పని చెయ్యని వానికి తినే హక్కులేదు

అనగనగా ఒకరాజ్యంలో ఒక రాజుగారుండేవారు. ఆయన ఎంతో మంచివారు. ఆయన ఎప్పుడూ ఆపదలో, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడానికి సిద్ధంగా ఉండే వాడు. ఆ రాజుగారి దర్బారుకు ఒకరోజు ఓ సోమరి దంపతులు వచ్చారు. “ఎమికోరి వచ్చా” రని రాజు వారిని అడిగారు. తాము ఏమీ లేని పేదవారమని, ఏదైనా జీవనోపాధి చూపించమని వారు రాజును వేడుకున్నారు.

“ఆ పేదవారికి రెండుగేదెలను ఇస్తే వారు పాడిచేసుకుని, పాలను అమ్మి జీవిస్తా”రని రాజుగారు మంత్రిని ఆదేశించాడు. మంత్రిగారు అందజేసిన పాడిగేదెలతో వారు ఆనందముగా ఇంటికి వెళ్ళారు.

ఒక వారం తరువాత ఆ సోమరి దంపతులు మళ్ళీ రాజ దర్బారుకు వచ్చారు. రాజుగారు వారిని “ఏమికావాల”ని అడిగారు. తాము ఇండ్లవెంట తిరిగి పాలను అమ్ముకోవడం చాలా కష్టంగా ఉన్నదని వారు విన్నవించుకున్నారు. పాలను అమ్మేవిషయంలో తమకు సాయంకావాలని అడిగారు. దానికా రాజు ఓ పశువుల కాపరిని పిలిచి, రోజూ వారింటికి వెళ్ళి పాలు తీసుకుని, ఇంటింటికి వెళ్ళి ఆ పాలను అమ్మి, ఆధనాన్ని వారికి ఇమ్మన్నాడు. సంతసించిన ఆ దంపతులు రాజును స్తుతిస్తూ ఇంటికి వెళ్ళారు.

ఇంకోవారం తరువాత ఆ సోమరి దంపతులు మళ్ళీ రాజదర్బారుకు వచ్చారు. ఈ సారి వారు తమకు గేదెలను మేపడం, పాలుపితకడం చాలా కష్టంగా ఉన్నదని మొరపెట్టుకున్నారు. ఈ విషయంలో సాయానికై ఎవరినైనా పంపిస్తే కృతజ్ఞులమై ఉంటామన్నారు. రాజు తన పశువుల కాపరులలో ఒకరిని రోజూ వారింటికి వెళ్లి గేదెలను మేపి, పాలు పితికి రమ్మన్నాడు. ఆ దంపతులు మరలా రాజును ఘనంగా స్తుతిస్తూ ఇంటికి వెళ్ళారు.

మరో వారంరోజుల తరువాత వారు మరలా రాజ దర్బారులో ప్రత్యక్షమయ్యారు. ఈసారి వారు చాలా విచారంగా, తమకు రోజూ వంటచేసుకోవడం చాలా కష్టంగా ఉందన్నారు. ఒక వంటవానిని పంపిస్తే, రాజుగారి పేరు చెప్పుకుంటామన్నారు. రాజు వారిని గాబరా పడవద్దని చెప్పి, వారికి వంటి పెట్టడానికి తన వంటవారిలో ఒకరిని పంపుతానని చెప్పాడు. ఆ దంపతులు అమితానందంతో రాజుగారిని మరింత ఘనంగా స్తుతిస్తూ ఇంటికి వెళ్లారు.

మరుసటిరోజు ఉదయం ఒక వంటవాడు వారి ఇంటికి వచ్చాడు. ఆ ఇంటి యజమానురాలు అతనికి వంటగదిని చూపించి, సరుకులు ఇచ్చి, ఏమి వండాలో, ఎలా వండాలో చెప్పింది. తమకు ఆహారం ఖచ్చితముగా మధ్యాహ్నానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించింది. వంటవాడు అలానే అని తల ఊపాడు.

ఆ దంపతులు మధ్యాహ్నం పండ్రెండుగంటలకు నిద్రలేచి, భోజనానికై వంటగదికి వెళ్ళారు. భోజనపు బల్లపై రెండు భోజన పళ్ళేలు సిద్ధంగా ఉన్నాయి. వంటవాడు ఆహార పదార్థాలతో సిద్ధంగా ఉన్నాడు. అంతా వారి ఆదేశాలమేరకు బాగానే ఉన్నదని, ఆ దంపతులు తృప్తిపడ్డారు. వారు భోజనానికై కాళ్ళూ చేతులు శుభ్రపరచుకుని తిరిగి వచ్చేటప్పటికి, ఆ భోజనపు బల్లదగ్గర తమకు తెలియని, బలమైన ఒక దంపతులు కూర్చుని వారికోసం సిద్ధంగా ఉన్న వంటకాన్ని తినడం ప్రారంభించారు. వండిన పదార్థాలన్నీ వంటవాడు ఒకదాని తరువాత ఒకటిగా జాగ్రత్తగా, వినయంతో వారికి వడ్డించసాగాడు, ఆ సోమరి దంపతుల కళ్ళెదుటే, వచ్చిన దంపతులు సుష్టుగా భోంచేశారు. దీనికి దిగ్భ్రాంతి చెందిన ఆ సోమరి దంపతులు, “మీరెవరు? మా ఇంటికి వచ్చి మా భోజనాన్ని ఆరగిస్తున్నారేమిటి?” అని గద్దించారు.

దానికి వారు తలెత్తి, చిరునవ్వుతో, “మీకు తినడంలో సహాయం చేయడానికని రాజుగారు మమ్మల్ని పంపించారు. ఇక నుండి మీకు తినే బాధకూడ ఉండదు, రోజూ మీ బదులుగా మేము తింటాము. మీ కస్సలు ఏ కష్టమూ ఉండదు. వెళ్ళి విశ్రాంతితీసుకోండి,” అన్నారు.

వెంటనే, ఆ దంపతులు రాజదర్బారుకు పరుగెత్తుకు వెళ్ళి, “ఓ దయగల రాజా! మీరు మాకు పంపిన సహాయన్నంతా వెనుకకు తీసుకొండి. ఇకనుండి మా పనులను మేము సక్రమంగా చేసుకుంటాం,” అని ప్రాధేయపడ్డారు. దానికి రాజు పెద్దగా నవ్వుతూ, ఆమోదంగా తల ఊపాడు.

సోమరితనానికి తగినగుణపాఠం చెప్పాల్సిందే!

**(చిన్మయామిషన్ వారి సౌజన్యంతో)**

---

* పాలులేనప్పటికిన్ని జీవించవచ్చును గాని జలములేనిచో జీవించ జాలరు. పంచదార లేనప్పటికిన్ని జీవించవచ్చును కాని లవణము లేని జీవితముకష్టతరము. పుత్రులు లేనప్పటికిన్ని జీవింపవచ్చును. భారముగాదు. అనుష్ఠానము లేని జీవితము దుర్భరము. కన్ను లేనప్పటికిన్ని జీవింపవచ్చును. భక్తిలేని జీవితము దుఃఖ కరము.

**శ్రీ సద్గురు మలయాళ స్వామి**

# శ్రీరాముడు తెల్పిన నవవిధ భక్తులు

**స్వామి పద్మనాభానంద సరస్వతి**

శబరి కిరాతస్త్రీ. ఆమె వివాహ సందర్భములో వారి కులచార ప్రకారం అనేక జంతువులను వధించడం ఆమె హృదయానికి దుఃఖాన్ని కలిగించింది. అందువలన ఆమె ఇల్లు వదలి మాతంగ మహర్షి ఆశ్రమమునకు వెళ్లింది. ఆకాలంలో ఆశ్రమములో స్త్రీలకు ప్రవేశం లేనందున, ఆమె ఆశ్రమము బయట శుభ్రం చేయడం, ముగ్గులు పెట్టడంవంటి సేవలు చేస్తూ ఉండేది. ఆమె భక్తి శ్రద్ధలకు మెచ్చిన మహర్షి ఆమెకు ఆశ్రమము లోనికి అనుమతి నిస్తారు. మంత్రోపదేశం చేశారు. "నీకురాముని దర్శనం తప్పకుండా లభిస్తుంది" అంటారు. అలాగ ఆమెరామనానుజపం చేస్తూ వృద్ధురాలయింది చివరికి రాముడు వస్తాడు ఆమెదగ్గరకు శబరిమాత శ్రీరామునితో " నేను అధమజాతినారిని. మందమతిని, ఏమీచేయ లేని దానిని. నిన్ను ఏవిధముగా పొందగలను" అని అడిగినది. శ్రీరాముడు ఆమెకు తరించె విధానం చెబుతాడు. అవే నవవిధ భక్తిమార్గములు.

మొదటి భక్తిమార్గము <u>సజ్జనసాంగత్యము</u>. అంటే సాధు సత్పురుషులతో సత్సంగం చేయుట ద్వారా భక్తి, ముక్తి, భవహరణం అన్నీ లభిస్తాయి. మంగళం, శుభం కూడ కలుగుతుంది. వారు తీర్థరాజంతో సమానము. గంగ, యమున, సరస్వతి. గంగ భక్తికి ప్రతీక, యమున కలికల్మషహారిణి, సరస్వతి జ్ఞానమునకు ప్రతీక. సాధుసత్పురుషుల సాంగత్యంలో ఇవన్నీ మనకు లభిస్తాయి.

రెండవది <u>నాకథల యందు అనురక్తి.</u> భగవంతుని కథల యందు మనం ఆసక్తి కలిగి యుండుట. తద్వారా మనకు దుఃఖము పోయి శాంతి లభిస్తుంది.

మూడవ భక్తిమార్గము <u>అభిమానము వదలి గురుచరణములను సేవించుట. గురుపాదతీర్థ స్వీకరణ</u>. మూలికలరసంతో శరీరం లోపల మలినాలు ఎలా పోతాయో, గురుపాదతీర్థము వలన మన మనస్సులోని మలినాలు కూడ ఆవిధముగా పోతాయని శంకరులు గురుపాదుకాస్తోత్రములో వివరించారు.

నాలుగవది <u>భగవంతునియొక్క గుణములను ఎప్పుడూ గానము చేయుట.</u> అలాచేయడం వలన మనకు అన్యతలంపులు తగ్గిపోతాయి. భగవంతుని తలంపులలోనే జీవిస్తాము.

<u>రామనామం జపించుచు రాముని పై దృఢ విశ్వాసం ఉంచుట</u>. ఐదవ విధమైన భక్తి. 'మననాత్ త్రాయతే ఇతి మంత్రః' మంత్రజపంవలన మనలో ఉన్న అన్ని దోషములు తొలగిపోతాయి. శివానందుల వారు కూడ 'జపయోగము' అనే పుస్తకములో చాలాబాగా వివరించారు మంత్రజపం గురించి.

ఆరవ భక్తి మార్గము: శమదమశీలము. శమము అంటె మనో నిగ్రహము. దమము అంటె ఇంద్రియ నిగ్రహము. శీలము అంటె సదాచారము.

అంతటా భగవంతుని స్వరూపాన్ని చూచుట ఏడవ భక్తి. భగవద్గీతలో కూడ చెప్పారు. 'అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ' కష్టాలు వచ్చినపుడు తటస్థంగా ఉండు. అంతే గాని వైరం పెంచుకోవద్దు. జాగ్రత్, స్వప్నములలో కూడా రామునినే చూడు.

ఎనిమిదవభక్తి. ప్రాప్తించిన దానితో సంతృప్తిని పొందుచు, స్వప్నమునగూడ ఇతరుల దోషములను తలంపకుండుట. ఇతరులలో దోషము చూచుట వలన మనలోని పుణ్యకర్మ బయటకుపోతుంది. మనకు పాపకర్మ కలుగుతుంది. వైరులలో కూడ భగవంతునే చూడు.

తొమ్మిదవభక్తి. అందరితో సరళముగా, నిష్కపటముగా వ్యవహరించుచు, హృదయమున భగవంతుని పై విశ్వాసముంచి, హర్షవిషాదములను దరిజేరనీయ కుండుట.

ఇదియే హనుమాన్ చాలీసాలో:- శ్రీగురుచరణ సరోజ రజ అంటే గురువు యొక్క పాదములను సేవించుటవలన, నిజమన ముకురసుధారి అంటే మన మనస్సు ఒక దర్పణము లాగ తయారు అవుతుంది. బరనురఘుబర బిమల యశ అంటే రఘువంశుడైన రాముని, హరహుకలేస బికార్ అంటే ధ్యానించడంవలన మనోదోషములు తొలగును. బుద్ధి హీనతను జానికే అంటే బుద్ధిహీనత తొలగుతుంది. బలబుధి బిద్యా దేహుమొహి అంటే బలమైన బుద్ధి విద్యా ప్రసాదిస్తాడు.

నీరులేని మేఘము ఎలా వృధా అవుతుందో, భక్తిలేని జ్ఞానము, యోగము, కర్మ వృధాఅవుతాయి. స్వామి శివానందులు పువ్వులు లేనితోట వలన ఎలా ప్రయోజనం ఉండదో అలాగే భక్తి లేని జ్ఞానము వృధా అన్నారు. అలాగే ఓంకార స్వామి కూడ నామజపము, ఓంకారము, తర్వాత ఆదివ్యతేజస్సునీవే అని బోధించారు. ఇది మన అనుభవములోనికి రావాలంటే గురుచరణములందు భక్తిఉండాలి. గురుకృపుండాలి.

(స్వామి పద్మనాభా నంద సరస్వతి వారు విశాఖ పట్నము శివానంద ఆశ్రమములో ది. 7. 8. 22న జరిగిన కార్యక్రమములో ఇచ్చిన దివ్యసందేశము.)

* సముద్రతీరమున ఎక్కువ హోరు ఉండును గాని, లోపలకు వెళ్ళిన కొలది నిశ్శబ్దముగా, శాంతముగా ఉండును. అటులనే ప్రార్థన, ధ్యానాదులు ప్రథమ స్థితులలో మనస్సు చంచలముగా యున్నను, సమాధిస్థితిని పొందినపుడు నిశ్చలమై గీతా సారమగు ఆనందమును గ్రోలుచుండును.

**స్వామి ఓంకార్**

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ, కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమైయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)

వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు :State Bank of India, 11 Sansad Marg, New Delhi-110001

A/c Name : THE MISSION OF PEACE - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షన్ : 6305349677
e-mail:srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 – 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి – 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266–271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ – 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం–533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

## దైవసాయుజ్యం

**ది. 7–7–2022 (గురువారం)** శ్రీ తటవర్తి నాగేశ్వరరావు గారి (మేస్త్రీ) ధర్మపత్ని శ్రీమతి తటవర్తి కృపావతిగారు పరమ పదించారు. వారికి ఆశ్రమముతో చాల అనుబంధం ఉంది.

**13–7–2022 (బుధవారం)** శ్రీమతి గళ్ళా ధనలక్ష్మి దైవ సన్నిధికి చేరుకున్నారు. దిగువవంటశాల లోను, ఎగువ వంట శాలలోను, ఆశ్రమములోని అన్ని పనులలోను వీరు తమ సేవలను అందించారు.

వీరిద్దరి ఆత్మ శాంతికొరుతూ ఆ శ్రమవాసులు ప్రార్థనలు చేశారు.

## కార్యక్రమములు – మాతృ ఆశ్రమం

**తేది 7–9–2022 (బుధవారం):** “వామన జయంతి” సందర్భంగా ఉ॥ 7.30 గం॥లకు శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన

**తేది 8–9–2022** స్వామి శివానంద మహరాజ్ జయంతి.

**తేది 24–9–2022** స్వామి చిదానంద మహరాజ్ జయంతి.

**తేది 25–9–2022 (ఆదివారం):** మహాలయ అమావాస్య సందర్భంగా ఉ॥ 7.30 గం॥లకు శ్రీదుర్గా అష్టోత్తర శతనామార్చన (ప్రార్థన మందిరం)

# శరన్నవరాత్రులు

**తేది 26-9-2022 (సోమవారం) నుండి తేది 5-10-2022 (బుధవారం) వరకు** పూజ్యశ్రీ ఓంకార స్వామిజీ వారి దివ్యాశీస్సులతో పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీ గణేష్ ఆచార్య, శ్రీగంగరాజు మస్టారు గారిచే నిర్వహించబడును.

**తేది 26-9-2022 (సోమవారం) నుండి తేది 28-9-2022 (బుధవారం) ఉ॥7.30గం॥లకు** కలశస్థాపన శ్రీ వినాయక పూజ సా॥ 6.00గం॥లకు దుర్గ అష్టోత్తర శతనామార్చన

**ది 29-9-2022 (గురువారం) నుండి 1-10-2022 (శనివారం)** శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామార్చన

**తేది 2-10-2022 (ఆదివారం) నుండి 4-10-2022 (మంగళవారం)** శ్రీ సరస్వతి అష్టోత్తర శతనామార్చన

**తేది 5-10-2022 (బుధవారం) ఉ॥ 7.30 గం॥లకు** శ్రీదేవి అష్టోత్తర శత నామార్చను సా॥6 గం॥ శమిపూజ

# మాతృ ఆశ్రమ వార్తలు

**ది. 3-8-22 బుధవారం.** శ్రీ శివానంద ఆశ్రమం (ఋషీకేశ్) నుండి శ్రీపద్మనాభానంద సరస్వతిస్వామి (జనరల్ సెక్రటరి) మాతృ ఆశ్రమమునకు (తోటపల్లి) విచ్చేసినారు. వారికి ఆశ్రమ వాసులందరూ స్వాగతముపలికారు.

**ది.4-8-22 గురువారం.** శ్రీపద్మనాభానంద సరస్వతి స్వామి వారు సాయంత్రం సత్సంగంలో తమ దివ్య భాషణాన్ని ప్రసాదించారు. ఓంకారస్వామి రాసిన (నాలుదశలలో ఉపదేశము)నకు తమ అమృత వచనములతో వివరణ ఇచ్చినారు. ప్రశాంతవాతావరణములో ఆశ్రమవాసులందరిని ఆధ్యాత్మిక భావనలతో ఓలలాడించినారు.

# విశాఖ శాఖ

**ది. 7-8-22 ఆదివారం** పూజ్యశ్రీ పద్మనాభానందస్వామి వారితో పాటు, స్వామిని వినమ్రానంద మాతాజీవారు విశాఖపట్నం శాంతి ఆశ్రమ శాఖకు వచ్చారు. ఆశ్రమంలో శ్రీఎమ్.ఎన్. ఆదిత్యగారు, భక్తులు, సేవకులు, బధిరబాలురు స్వామిజీకి ఘనంగా స్వాగతం పలికారు. ఉ.11.00గం॥లకు ఓంకార మందిరంలో పుష్పమాలాంకరణ పిదప స్వామీజీ భక్తులందరికి ఆశీర్వచనం పలికి ప్రసాదవితరణ గావించారు. సాయంత్రం శివానంద ఆశ్రమంలో కార్య క్రమము జరిగినది. స్వామిజీతో పాటు వినమ్రానందమాతాజీ వారు కూడా పాల్గొన్నారు.

**ది. 8-8-2022 సోమవారం** విజయనగరం జిల్లా కొవ్వాడ గ్రామంలో పూజ్యశ్రీ దేవానందస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ జరిగినది. పుష్పమాలాంకరణ, లఘుపూజ తరువాత స్వామీజి అనేక మంది భక్తులకు మంత్రదీక్ష ఇచ్చారు. వినమ్రానంద మాతాజీ వారు ఆ కార్యక్రమలో పాల్గొన్నారు.

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023


## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......... Rs. 10/-
3. Soham .......... Rs. 10/-
4. Cosmic Fast .......... Rs. 20/-
5. Meditation .......... Rs.10/-
6. Om Japa .......... Rs.10/-
7. Control of Mind .......... Rs.30/-
8. Cosmic Flashes .......... Rs.10/-
9. In the Hours of Silence .......... Rs.10/-
10. The Soul of Omkar .......... Rs.10/-
11. How I learned English .......... Rs.10/-
12. Reincarnation of my Little Sister .......... Rs.10/-
13. God Realization Now and Here .......... Rs.10/-
14. Mystic Prayers and Poems .......... Rs.20/-
15. The Divine Voice of Omkar .......... Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) .......... Rs.100/-
17. Petals of Peace .......... Rs.20/-
18. The Story of my life and Work .......... Rs.10/-
19. Priceless legacy of Swami Omkar .......... Rs.10/-
20. The Four Initiations .......... Rs.10/-
21. Musings .......... Rs.20/-
22. Peace Prayer .......... Rs.20/-



THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org


Printed Book

To

Printed by Padmanabha Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Padmanabha Off-set Printers, Kakinada - 533 004 Cell : 93979 50719 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.